జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

కావలెను
రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న
పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి
ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.
ప్రతి వాలంటీర్ కు
నెలకు Rs.25,000/-
Salary ఇవ్వబడును.
విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వాలంటీర్ గా చేరవచ్చు.
ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా
మీ ప్రాంతంలో ఉన్న పార్టీ లీడర్స్ ని సంప్రదించవచ్చు.
లేదా ఈ క్రింది నెంబర్
7660027683 కి వాట్సాప్ చేయగలరు.

సంపుటి 15 సంచిక 281 విశాఖపట్నం గురువారం 08 జూన్2023 8 పేజీలు వెల : 5.00

## కష్టపడితే.. మళ్లీ

# గెలుపు మనదే..



## ముందస్తు ఎన్నికలకు వెళ్లేది లేదు... కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీరణ

## కొత్త ఫించన్ పథకం.. మంత్రి వర్గ సమావేశంలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి

అమరావతి: ఏపీలో ముందస్తు ఎన్నికలపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి క్లారిటీ ఇచ్చేశారు. మంత్రుల సమావేశంలో సీఎం జగన్ ఊహాగానాలకు తెరదించారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లేది లేదని జగన్ తేల్చిచెప్పేశారు. ఈమేరకు కేబినెట్ సమావేశంలో మంత్రులకు స్పష్టంగా తెలియజేశారు. షెడ్యూల్ ప్రకారవే ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇంకో 9 నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయని మంత్రులకు జగన్ క్లారిటీ ఇచ్చేశారు. ఈ 9 నెలలు బాగా కష్టపడాలని మంత్రులకు ఈ సందర్భంగా సీఎం సూచించారు. ఇప్పుడు కష్టపడితే మళ్లీ గెలుపు మనదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. పనిలో పనిగా ఇటీవల రాజమండ్రి మహానాడులో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో అంశాన్ని కూడా ముఖ్యమంత్రి జగన్ గుర్తుచేశారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను పట్టించుకోవాల్సిన అవసరం లేదని జగన్ తేల్చిచెప్పేశారు. ఇటీవల ముందస్తు ఎన్నికలపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా మాట్లాడారు. ముందస్తుకు వెళ్లే ఆలోచన లేదని చెప్పారు. దీనిపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ టీడీపీ ఎద్దేవా చేసింది. ముందస్తుకు వెళ్తే ఓడిపోతామన్న భయంతో వైసీపీ వణికిపోతుందని ఆ పార్టీ సీనియర్ నేత వర్ల రామయ్య విమర్శించారు. వైనాట్ 175 సీట్లు గెలుస్తామన్న జగన్ డాంబికాలు ఏమయ్యాయని వర్ల రామయ్య నిలదీశారు. తాజాగా సీఎం జగన్ కూడా ముందస్తు ఎన్నికలపై క్లారిటీ ఇచ్చేశారు. మరీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్ష పార్టీలు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి



## మణిపూర్‌లో ఆగని హింస..

### అంబులెన్స్‌కు నిప్పు, 8 ఏళ్ల బాలుడు, తల్లి మరో వ్యక్తి మృతి

గువాహాటి: బీజేపీ పాలిత మణిపూర్‌లో హింస ఇంకా తగ్గలేదు. మెయిటీ, కుకీ వర్గాల మధ్య పోరాటం ఇంకా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో తుపాకీ కాల్పుల్లో గాయపడిన ఒక బాలుడ్ని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఎనిమిదేళ్ల బాలుడు, అతడి తల్లి, బంధువైన వ్యక్తి సజీవ దహనమయ్యారు. పశ్చిమ ఇంఫాల్‌లోని ఇరోయిసెంబా ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. అస్సాం రైఫిల్స్ భద్రతగా ఉన్న శిబిరంపై ఆదివారం సాయంత్రం దాడి జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో 8 ఏళ్ల బాలుడి తలకు బుల్లెట్ గాయమైంది. దీంతో ఇంఫాల్‌లోని పోలీసులతో అస్సాం రైఫిల్స్ ఆఫీసర్ ఫోన్‌లో మాట్లాడారు. ఇంఫాల్‌లోని రిమ్స్‌కు ఆ బాలుడ్ని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా, తలకు బుల్లెట్ గాయమైన 8 ఏళ్ల బాలుడ్ని అంబులెన్స్‌లో ఇంఫాల్ తరలించేందుకు ప్రయత్నించారు. ఆ బాలుడి తల్లి, బంధువైన వ్యక్తి అందులో ప్రయాణించారు. కొంత దూరం వరకు అస్సాం రైఫిల్స్ సిబ్బంది అంబులెన్స్‌కు ఎస్కార్ట్‌గా ఉన్నారు. ఆ తర్వాత ఆ బాధ్యతను స్థానిక పోలీసులు తీసుకున్నారు.

## డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ బాధ్యతలను మహిళకు అప్పగించాలి: రెజ్లర్ల డిమాండ్



న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్‌గా మహిళను నియమించాలని రెజ్లర్లు డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలంటూ ఆందోళన చేపడుతున్న రెజ్లర్లను కేంద్రప్రభుత్వం బుధవారం మరోసారి చర్చలకు పిలిచింది. దీంతో కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ నివాసానికి చేరుకున్న బజరంగ్ పునియా, సాక్షి మాలిక్‌లు ఆయనతో సమావేశమయ్యారు. బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు ఐదు డిమాండ్లను జాబితా చేసినట్లు సమాచారం. రెజ్లింగ్ ఫెడరేషన్‌ను మహిళకు అప్పగించాలని, అలాగే బ్రిజ్ భూషణ్ గానీ, ఆయన కుటుంబసభ్యులు గానీ డబ్ల్యుఎఫ్ఐలో భాగం కాకూడదని డిమాండ్ చేశారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్ష పదవిని మహిళకు అప్పగించాలని, రెజ్లింగ్ ఫెడరేషన్‌లో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని, ఏప్రిల్ 28న జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఉద్రిక్తతల కారణంగా తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెజ్లర్లు కేంద్ర ప్రభుత్వంతో సమావేశమవడం వారంలో ఇది రెండోసారి. గతవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమైన సంగతి తెలిసిందే.

## అఖిలేష్ యాదవ్‌తో కేజ్రీవాల్ భేటీ



లక్నో : ఢిల్లీలో బ్యూరోక్రాట్ల నియామకం, బదిలీలపై పట్టు కోసం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఢిల్లీ సీఎం, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ విపక్షాల మద్దతును కూడగడుతున్నారు. ఎస్పీ చీఫ్, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్‌ను బుధవారం కేజ్రీవాల్ కలిశారు. ఈ సమావేశంలో కేజ్రీవాల్ వెంట పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌తో పాటు ఇతర ఆప్ నేతలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తమ పోరాటానికి కలిసి రావాలని ఈ సందర్భంగా అఖిలేష్ యాదవ్‌ను కేజ్రీవాల్ కోరారు. ఢిల్లీ అధికారాలను నిర్వీర్యం చేసేలా కేంద్రం వ్యవహరిస్తోందని నేతలు పేర్కొన్నారు. ఇక ఢిల్లీ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేస్తామని వెల్లడించిన కేజ్రీవాల్ ఇప్పటికే తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పాటు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేలను కలిసి మద్దతు కోరారు. కాగా, అంతకుముందు యోగి ఆదిత్యానాథ్ సారథ్యంలోని యూపీ సర్కార్‌పై ఎస్పీ చీఫ్, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాషాయ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పాయని మండిపడ్డారు. రౌడీలు, గూండాలు చెలరేగుతుంటే అల్లరి మూకలను ప్రభుత్వం నియంత్రించలేకపోతోందని దుయ్యబట్టారు. కన్నౌజ్‌లో ఓ ఎంపీ తన గూండాలతో వెళ్లి ఔట్‌పోస్టులో ఉన్న పోలీసులందరినీ కొట్టినా యోగి సర్కార్ ప్రేక్షక పాత్రకు పరిమితమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పని మరెవరో చేసి ఉంటే, ఈ ప్రభుత్వం బుల్డోజర్లతో నేరగాళ్ల ఇండ్లను నేలమట్టం చేసేదని అన్నారు. ఎంపీ ఇంటి వద్ద ప్రభుత్వం బుల్డోజర్లను ఎందుకు తరలించడం లేదని యోగి సర్కార్‌ను అఖిలేష్ నిలదీశారు. న్యాయం చేయాలంటూ ఢిల్లీలో మహిళా రెజ్లర్లు గొంతెత్తి అలసిపోయారని, వారు నిరసనలతో గళమెత్తినా మోదీ సర్కార్ నోరు మెదపడం లేదని ఎస్పీ చీఫ్ కాషాయ పాలకుల తీరును దుయ్యబట్టారు.

## 12న పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం : యుపి పొటాటో రైతులు




లక్నో : కోల్డ్‌స్టోరేజీ యజమానుల ధరల పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా యుపి బంగాళదుంప రైతుల ఆందోళన కొనసాగుతోంది. ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. భారతీయ కిసాన్ యూనియన్ (బికెయు), ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) బ్యానర్ కింద గత కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు కాదని, కోల్డ్ స్టోరేజీ యజమానులు ఏకపక్షంగా, అన్యాయంగా ధరలను పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కిసాన్ సంఘర్ష్ సమితి కింద కన్నౌజ్ కలెక్టరేట్ వరకు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించింది. కోల్డ్‌స్టోరేజీ యజమానులకు, జిల్లా ఉద్యానవన విభాగానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతు నేత గీతేంద్ర సింగ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోల్డ్‌స్టోరేజీ యజమానులు ధరలను నియంత్రించకుంటే ఈ నెల 12న లక్నోలో పెద్ద ఎత్తున ఆందోళనను చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం 2023-24లో స్టోరేజీ కోసం సాదా బంగాళాదుంపలకు క్వింటాకు రూ. 230, షుగర్ ఫ్రీ బంగాళాదుంప క్వింటాకు రూ. 260గా నిర్ణయించింది. కానీ కోల్డ్ స్టోరేజీ యజమానులు క్వింటాకి అదనంగా రూ. 60 వసూలు చేస్తున్నారని, దీంతో రైతులు తమ ఉత్పత్తులను విక్రయించినా హెక్టారుకు రూ. 17,000 నుండి రూ. 19,000 వరకు నష్టపోతున్నారని రైతు సంఘాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది బంగాళదుంప సాగు అధికంగా ఉందని, దీంతో కోల్డ్‌స్టోరేజీ యజమానులు ఇష్టారీతిన ధరలను పెంచేశారని కన్నౌజ్ జిల్లా బికెయు అధ్యక్షుడు షామిమ్ అహ్మద్ తెలిపారు. ధరల పెంపుతో రైతులపై అదనపు భారం పడుతోందని అన్నారు. కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి ప్రభుత్వం 30శాతం నుండి 40 శాతం వరకు సబ్సిడీ అందిస్తోందని, కానీ ఇవి రైతులకు లబ్ధి చేకూర్చడం లేదని ఆగ్రాకు చెందిన మరో రైతు నేత శ్యామ్ సింగ్ చాహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మొత్తం బంగాళా దుంప ఉత్పత్తిలో 35 శాతం వాటా యుపి నుండే వస్తుంది.

## వీడని వడగాడ్పులు



అమరావతి : రాష్ట్రంలో ఎండల తీవ్రతకు వడగాడ్పులు కొనసాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 17 మండలాల్లో ఒక మాదిరి తీవ్ర వడగాడ్పులు, 161 మండలాల్లో వడగాడ్పులు వీచినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా ఏలూరు జిల్లా పంగిడిగూడెంలో 44.9 డిగ్రీలు, ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో 44.7, తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 44.6, పశ్చిమగోదావరి జిల్లాలోని వరదరాజపురంలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. బుధవారం 12 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు ఉంటాయని తెలిపారు.



## రెడ్ క్రాస్ భవనంలో జనరిక్ మెడిసిన్ షాపు నిర్మాణం



బాపట్ల జిల్లా ప్రజా పాలన జూన్ 7: బాపట్ల పట్టణం రెడ్ క్రాస్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న జనరిక్ మెడిసిన్ షాపు నిర్మాణంకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రముఖ రియల్ స్టేట్ బిల్డర్ గుండ్రెడ్డి శివ సహకారంతో షాపుకు భూమి పూజ చేసిన రెడ్ క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు, బాపట్ల పట్టణ,రూరల్ సీఐలు కృష్ణయ్య, వేణుగోపాల్ రెడ్డి ఎస్ఐ సింగయ్య పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నరసరావుపేటలో పూర్తిస్థాయి ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తాం: ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 7. (ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేటలో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ కంట్రోల్ చేస్తామని ట్రాఫిక్ సిగ్నల్స్ 8 చోట్ల ఏర్పాటు చేశామని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం మల్లంమ్మ సెంటర్లోని మూడు కోట్ల రూపాయలతో 8 చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఏర్పాటు చేసి మల్లం సెంటర్లోని ట్రాఫిక్ సిగ్నల్ ను ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట జిల్లా అయిన తర్వాత ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని అన్నారు మూడు కోట్ల రూపాయలతో 8 చోట్ల సిగ్నల్స్ ని ఏర్పాటు చేశామని తెలిపారు .ప్రధాన రహదారుల్లో పార్కింగ్ ఏరియాలో ప్రజలు వ్యాపారస్తులు పార్కింగ్ ఏరియాలోని పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. జిల్లా అయిన తర్వాత ట్రాఫిక్ ఎక్కువగా ఉండటం వలన ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని , త్వరలో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేస్తామని తెలిపారు .జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డితో చొరవతో సిగ్నల్ ఏర్పాటు చేశామని తెలిపారు. 8 చోట్ల సిగ్నల్స్ ని ఏర్పాటు చేశామని ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సమస్య లేకుండా పూర్తిస్థాయిలో ట్రాఫిక్ సమస్యను లేకుండా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు కపిలవాయి విజయ్ కుమార్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చార్లీ 777 మరియు డ్రామా జూనియర్స్ సీజన్ 6 ప్రారంభం

విజయవాడ, 06 జూన్ 2023: తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించే జీ తెలుగు ఈ ఆదివారం మరింత వినోదం అందించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న ఫన్ అండ్ ఎమోషనల్ డ్రామా చార్లీ 777ని వరల్డ్ ప్రీమియర్ గా ఈ ఆదివారం అందిస్తోంది. అలాగే చిన్న పిల్లల్లోని టాలెంటిని ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు చూపే సక్సెస్ఫుల్ రియాలిటీ షో డ్రామా జూనియర్స్ తదుపరి సీజన్తో మీ ముందుకు రానుంది. తెలుగు టెలివిజన్ చరిత్రలో సీనియర్ హీరోయిన్ జయప్రద మొదటిసారి డ్రామా జూనియర్స్ సీజన్ 6తో బుల్లితెరపై కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు. చార్లీ 777 ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు మరియు డ్రామా జూనియర్స్ సీజన్ 6, జూన్ 11న ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, జీ తెలుగులో ప్రారంభం అవుతుంది. ఇక, సంవత్సరాల నుంచి అందరి హృదయాలను గెలుచుకున్న డ్రామా జూనియర్స్ విజయవంతంగా 5 సీజన్ లను పూర్తి చేసుకుని 6వ సీజన్తో మరోసారి ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమైంది. ప్రతిభ గల చిన్నారులను మరింత ప్రోత్సహించి వారిని ఆశీర్వదించేందుకు తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని ప్రముఖ నటులు జయప్రద, బాబు మోహన్ మరియు శ్రీదేవి విజయ్కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు.

## ఇండియన్ ఆయిల్ సర్వో హైపర్ స్పోర్ట్స్ ఎఫ్5, సర్వో గ్రీజ్ మిరాకిల్‌ను విడుదల చేసిన జాన్ అబ్రహం



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి: సర్వో బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ భారతీయ చలనచిత్ర నటుడు జాన్ అబ్రహం, న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మోటార్ సైకిళ్ల కోసం పూర్తి సింథటిక్ 4టి ఇంజిన్ ఆయిల్ సర్వో హైపర్ స్పోర్ట్స్ ఎఫ్5ను విడుదల చేశారు. దీనితో పాటు ఒక వినూత్నమైన ప్రీమియం గ్రీజు సర్వో గ్రీజ్ మిరాకిల్ ను కూడా ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ ఎస్ఎం వైద్య, బోర్డు సభ్యులు, ఛానెల్ భాగస్వాములు, కార్పొరేషన్‌లోని సీనియర్ అధికారులతో పాటు కస్టమర్ల సమక్షంలో ఈ సరికొత్త ఉత్పత్తులను ఆవిష్కరించారు. 4టి ఇంజిన్ ఆయిల్‌ను విడుదల చేసిన అనంతరం జాన్ అబ్రహం మాట్లాడుతూ, “ఒక ఉద్వేగభరితమైన బైకర్‌గా, నేను సర్వో హైపర్‌స్పోర్ట్ ఎఫ్5 మోటార్‌సైకిల్ ఇంజన్ ఆయిల్ యొక్క అద్భుతమైన ఆవిష్కరణలో భాగమైనందుకు ఆనందంగా ఉన్నాను” అని అన్నారు.

## నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక మహాలక్ష్మి -మహా సంప్రోక్షణ కార్యక్రమాలు



బాపట్ల జిల్లా ప్రజా పాలన జూన్ 7: టీటీడీ ఆగమ సలహాదారు శ్రీమాన్ నల్లూరి వెంకట మోహన్ రంగాచార్యులు ఆధ్వర్యంలో రిత్వికులు బృందంచే ఆద్యంతం భక్తి శ్రద్ధలతో ఈ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించబడినాయి. ఈ సందర్భంగా అతిథులకు ఆలయ వ్యవస్థాపక శాశ్వత ధర్మకర్తలు డా ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు,డా ఉమ్మారెడ్డి వెంకటరమణ, ఉమ్మారెడ్డి వీరగణేష్,ఉమ్మారెడ్డి వీరేంద్రకుమార్ ఆలయ పాలక వర్గం ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 10 వేల మంది కి పైగా భక్తులకు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామ కృష్ణా రెడ్డి,రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి,విజయసాయి రెడ్డి, మోపిదేవి వెంకటరమణ,బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి,పొన్నూరు శాసన సభ్యులు కిలారి వెంకట రోశయ్య, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## రిలయన్స్ ఆధ్వర్యంలో వధువు సంబరాలు “మీలో ఉన్న రాణికి వివాహ ఆభరణాలు”

విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి జూన్ 7: ఆభరణాల పరిశ్రమలో ప్రముఖ సంస్థ అయిన రిలయన్స్ జివెల్స్, ఎంతగానో ఎదురుచూస్తున్న తన “వివాహం కలెక్షన్” – ఏ అంతస్తుకు చెందిన వధువు అయినా తన ప్రత్యేకమైన రోజున ఒక రాణిలా అనుభూతి చెందుటకు రూపొందించబడిన ప్రత్యేక వివాహ ఆభరణాల శ్రేణిని ప్రారంభించారు. వివాహం కలెక్షన్, భారతదేశములోని వివిధ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, 15 విభిన్నమైన వైవాహిక ఆకర్షణను ప్రదర్శిస్తుంది. సంపన్నమైన బెంగాలి చదువు నుండి మెరిసిపోయే ఒడిశా వధువు వరకు, అందమైన మహారాష్ట్ర వధువు నుండి సొగసైన రాజస్థాని వధువు వరకు, ఆధునికమైన మెట్రో వధువు నుండి అబ్బురపరిచే పంజాబి వధువు వరకు, పొందికైన తెలుగు వధువు నుండి శోభాయమానంగా ఉన్న బిహారి వధువు వరకు ప్రతి వధువును పరిపూర్ణగా చూపించేందుకు రిలయన్స్ జివెల్స్ ఆభరణాలను సునిశితంగా తయారుచేసింది. ఈ కలెక్షన్ లో చోకర్స్, పొడవైన నెక్లెస్ లు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, చోకర్ సెట్లు, మంగళసూత్రాలు, పాపిటబొట్లు, నత్తులు, హాత్ఫూల్స్, వడ్డాణాలు, ఆర్మ్ బ్యాండ్స్, కంకణాలు మరియు మరెన్నో. ఉన్నాయి.”మా వివాహ కలెక్షన్ భారతీయ వివాహాల వైభవము మరియు వైవిధ్యాలకు ఒక ప్రామాణికము,” అని శ్రీ సునీల్ నాయక్, సీఈఓ, రిలయన్స్ జివెల్స్ అన్నారు.

## రక్త దానం ప్రాణ దానంతో సమానం.. సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్: కొమ్మినేని శ్రీనివాస రావు



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి జూన్. 7: “రక్త దానం” ప్రాణ దానంతో సమానమని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు అన్నారు. స్థానిక మీడియా అకాడమీ కార్యాలయం లో అనంతపురం కు చెందిన “మానవత బ్లడ్ డోనార్స్ ఆర్గనైజేషన్” కో కన్వీనర్, పాత్రికేయులు, కె.సలీం మాలిక్ ను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో పనిచేస్తోన్న వ్యక్తులు, సంస్థల ను ప్రోత్సాహించడం అవసరమని అన్నారు. తాము చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాటినుండి “మీడియా అకాడమీ” ఈ విధమైన కార్యక్రమాలతో సమాజ హితాన్ని కోరే వారిని గౌరవించడం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. 43 ఏళ్ల వయస్సులో 64 సార్లు రక్తదానం చేసిన సలీం మాలిక్ ను చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ మామిడిపల్లి బాల గంగాధర తిలక్ మాట్లాడుతూ రక్త దానం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడిన సంగతిని తమ ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో ప్రత్యక్షంగా చూశానన్నారు. ఎన్నో సమయాల్లో రక్తం అందక ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు కూడా మనకు తెలుసునని అన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ, అందుకు వేలాది మందిలో స్ఫూర్తి కలిగిస్తోన్న సలీం మాలిక్ అభినందనీయులని ఆయన అన్నారు. గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రేడియోలజిస్ట్ డా. జానీ మాట్లాడుతూ బ్రిటన్ దేశం తర్వాత ప్రజలు ఆరోగ్యం పై అత్యధికంగా ఖర్చు చేస్తోన్న ప్రభుత్వం జగన్ మోహన రెడ్డి దే నన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అనే ముఖ్య మంత్రి కలను నిజం చేయడంలో తమ వంతు పాత్రను నిర్వహిస్తున్నామన్నారు. సలీం మాలిక్ వంటి రక్త దాతల పరిచయం తమ సామాజిక దృక్పథాన్ని మార్చేసిందన్నారు. తమకు జరిగిన సత్కారానికి సలీం మాలిక్ కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ పాత్రికేయులు, ప్రస్తుత మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ కొమ్మినేని శ్రీనివాస రావు తమను సన్మానించడం గర్వ కారణమన్నారు. దేశం లో వున్న రక్త అవసరాలకు ప్రతి 100 మంది లో 18 మంది రక్త దానం ఇవ్వగలిగితే సరిపోతుందన్నారు. ప్రస్తుతం అనంత పురం జిల్లాలో,వందమంది లో 13 మంది వరకు స్వచ్ఛందంగా రక్త దానం చేస్తున్నారన్నారు. సామాజిక బాధ్యతగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. రక్త దానం విలువైనది, సులువైనది అని ఆయన అన్నారు. సమావేశం లో ఓ.ఎస్.డి టు చైర్మన్ శ్రీ ఎస్. శ్రీనివాస జీవన్, అక్కౌంట్స్ అధికారి శ్రీ ఎం.ఎస్.ఎన్ మూర్తి, కంటెంట్ ఎడిటర్ శ్రీ కలమండ శరత్ బాబు, డి.ఈ.ఓ. శ్రీ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి మార్టూరు మండల ఎస్సీ సెల్ కమిటీ నియామకం

**అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విజయకుమార్, కోటిస్వామి**





మార్టూరు(పర్చూరు), జూన్ 07, ప్రజాపాలన : తెలుగుదేశం పార్టీ మార్టూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పల్లపాటి విజయకుమార్ (మార్టూరు), మణికా కోటి స్వామి (లక్కవరం)లను, ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు, తెలుగుదేశం పార్టీ మార్టూరు మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీ సభ్యులకి, ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు, నూతన కమిటీ వారు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ మార్టూరు మండల ఎస్సీ సెల్అధ్యక్షులుగా పల్లపాటి విజయ్‌కుమార్ (మార్టూరు), ప్రధాన కార్యదర్శి మణికా కోటిస్వామి (లక్కవరం), ఉపాధ్యక్షులుగా గాలి మోషే (చిమ్మిరి బండ), విప్పర్ల.ఏసురత్నం(బొబ్బేపల్లి)లు, కార్యనిర్వాహక కార్యదర్సులుగా తమ్మలూరి నాగరాజు (ద్రోణాదుల), గాలి అరుణ్‌కుమార్ (కోలలపూడి), జ్యోతి పున్నారావు (డేగలమూడి)లు, కార్యదర్శిలుగా బండి యాకోబు(రాజుపాలెం), నిదానం పెద్దారావు(జొన్న తాళి), గల్లా ఇజ్రాయిల్ (నాగరాజుపల్లి)లు, కార్యవర్గ సభ్యులుగా పూరిమెట్ల శ్యాంసన్ (బొబ్బేపల్లి), నాగండ్ల పుల్లారావు, మార్టూరు (బైనీడి) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వెల్లడించారు.

## జనసేన అర్‌కె అధ్వర్యంలో యాచకులకు పాదరక్షలు అందజేత



గుడివాడ : తోటి మనిషికి సేవ చేయాలి అనే సద్భావంతో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో యాచకులకు తనకు తోచిన సహాయం యాదకులకు పాదరక్షలు అందజేయడం ఎంతో అనందంగా ఉందని జనసేన నాయకుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. బుధవారం ఈ సందర్భంగా జనసేన నాయకుడు అర్‌కె మాట్లాడుతూ పట్టణంలో కొన్ని రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. దీని వల్ల రోడ్డుమీద ఉన్న యాచకులు ఎండలో భిక్షాటన చేసుకుంటూ కాళు కాలిపోతూ ఇబ్బంది పడడం చూసి బాదవేసిందన్నారు. ఉన్నదంట్లో నుండి మానవసేవయే మాధవసేవ అనే నినాదంతో వారికి పాదరక్షకులు అందజేసి మానవత్వాన్ని చాడడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కర్యకర్తలు పాల్గొన్నారు.

## గుడివాడ టిడిపి కార్యకర్తకు నారా లోకేష్ పట్టు వస్త్రాలు పంపించడం శుభసూచకం: మాజీ ఎమ్మెల్యే రావి



గుడివాడ : గుడివాడ నాగవరప్పాడుకు చెందిన టిడిపి నాయకుడు గుండెమడ దుర్గారావు, కళ్యాణి దంపతులను ఆశీర్వదిస్తూ టిడిపి జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంపిన పట్టు వస్త్రాలను నూతన వధూవరులకు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో అందరూ కుటుంబసభ్యులేన్నారు. కర్యక్రర్తకు లోకేష్ పట్టు వస్త్రాలు పంపించి గొప్ప మానసును చాటుకునరన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్ద రెడ్డిపాలెంలోని సునీత అంతోని వారి నూతన దేవాలయం ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూన్ 7 (ప్రజాపాలన ప్రతినిధి.): నరసరావుపేట మండలం పెద్ద రెడ్డిపాలెం గ్రామంలో పునీత అంతోని వారి నూతన దేవాలయం ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావు పేట గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అనంతరం శ్రీ శ్రీ శ్రీ చిన్నా బత్తిని భాగ్యయ్య గుంటూరు పీఠాధిపతులు నిర్వహించిన ప్రతిక ప్రార్ధనలు పాల్గొని గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ని చర్చి కమిటీ సభ్యులు సన్మానంతో సత్కరించారు, ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీపీ మండల నాయకులు గ్రామ నాయకులు, సర్పంచు ఎంపీటీసీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ సతీమణి రమభాయిా విగ్రహం స్వల్పంగా ధ్వంసం



బాపట్ల జిల్లా ప్రజా పాలన జూన్ 7: కొద్దిరోజులు క్రితం బాపట్ల రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న డా బిర్ అంబేడ్కర్ వారి సతీమణి రమభాయిా విగ్రహాలు ను గుర్తు తెలియని వ్యక్తులు స్వల్పంగా ధ్వంసం చేయటం తో దీనిపై దళిత సంఘాల నాయకులు పట్టణ స్టేషన్లో లో ఫిర్యాదు చేయగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ క్రిష్ణయ్య చొరవతో మళ్ళీ విగ్రహాలకు మరమ్మత్తులు తన సొంత ఖర్చులతో అంగరంగ వైభవంగా చేయడం జరిగింది అనంతరం ఈరోజు దళిత నాయకులు ఆధ్వర్యంలో మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజాన్ బాబు, ఏ యన్ పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా చార్వాక, జంగం దాస్ ,బీఎస్పీ నాయకులు కోటేశ్వరరావు, కొచర్ల వినయ్, సమతా సైనికదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకర్, వియస్ ఫౌండేషన్ గోర్రుముచు వందనం, పట్టణ, రూరల్ సిఐలు కృష్ణయ్య, వేణుగోపాల్ రెడ్డి, టౌన్ యస్ ఐ సింగయ్యు లు అంబెడ్కర్ రమాబాయ్ విగ్రహాలు కు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొద్ది రోజుల లో పాత బస్టాండ్ వెంకటేశ్వర స్వామి టెంపుల్ దగ్గర నుండి దేశ నాయకులు విగ్రహాలు ఉన్నంతవరకు వరకు సీసీ కెమెరాలు, విద్యుత్ లైట్లు త్వరలో ఏర్పాటు చేస్తామని సిఐలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సి.ఐ.లు కృష్ణయ్య వేణుగోపాల్ రెడ్డి దళిత నాయకులు ప్రత్యక దన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో తదితర నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జగన్ ఈ నెల 9న గుడివాడ రాక: జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీపిలు



గుడివాడ : ఈ నెల 9వ తేది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా ఎస్పి పి.జాషువాలు తెలిపారు. బుధవారం స్థానిక మల్లాయపాలెంలోని టిడ్కో గృహాల ప్రాంగణంలో కలెక్టర్ రాజాబాబు విలేకర్లుతో మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద టిడ్కో క్లస్టర్‌ను సియం జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేది ఉదయం 9గంలకు ప్రారంభిస్తారన్నారు. అనతరం 20మంది లబ్ధిదారులకు లాంఛనంగా ప్లాట్లను అప్పగిస్తారన్నారు. గుడివాడ సీఎం పర్యటన ప్రత్యేకత సంతరించుకోవడంతో ప్రభుత్వ యంత్రాంగమంతా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా ఎస్సీపి జాషువా మాట్లాడుతూ సీఎం పర్యటనలో శాంతిభద్రతలకు విగాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధిక సంఖ్యలో వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకునేలా డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బందోబస్తు, భద్రతలో రాజీ లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

## టిడ్కో లబ్ధిదారుల బ్యాంక్ వాయిదాలను ప్రభుత్వమే భరించాలి: వెనిగండ్ల రాము

గుడివాడ : గుడివాడలో టిడ్కో ఇల్లు పంపిణి చేయడం



అభినందనీయమాని, ప్రతి పక్ష నేతగా ఉన్న సమయంలో జగన్ గుడివాడ గడ్డం మీదకు వచ్చినప్పుడు అయన చెప్పి నట్లు టిడ్కో ఫ్లాట్లు ఉచితంగా ఇస్తామన్న మాటను నిలబెట్టు కోవాలని ఎన్ఆర్ఐ టిడిపి నాయకుడు వెనిగండ్ల రాము కోరారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని బైపాస్‌రోడ్డులోని అయన వ్యక్తిగత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో అయన మాట్లాడుతూ వైసీపీ ట్రేడ్ మార్క్ రాజకీయాలు మొదలు పెట్టిందన్నారు. నాలుగేళ్లుగా చెదలు పడుతున్న టిడ్కో గృహలబ్ధిదారులకు ఫ్లాట్లు అప్పగించడంలేదన్నారు. లోకేష్ ప్రభావం, చంద్రబాబుకు ప్రజలు చూపిస్తున్న ఆదరణ చూసి, వైసిపి ప్రభుత్వనికి భయం పట్టుకుందన్నారు. అందుకే ఎంటువంటి మౌళికవసుతులు లేకండ గృహలను హడవుడిగా పంపిణి చేస్తునరన్నారు. టీడ్కో లే అవుట్ స్థలం కాంగ్రెస్ హయాంలో సేకరించి, నిర్మాణాలు టిడిపి హయాంలో జరిగాయిని ప్రతి ఒక్కరికి తెలసున్నారు. ఫ్లాట్ల నిర్మాణంలో ఎమ్మెల్యే నాని పాత్ర ఎంటిని ప్రశ్నించారు. తొలగించిన వందలాది మంది లబ్ధిదారులు, చెల్లించిన నగదు ఎవరి జేబుల్లోకి వెళ్ళిందన్నారు. అధికారులు జేబిలోక లేక ఎమ్మెల్యే బేబిలోక అన్ని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు గుత్తా చంటి, షేక్ ఇబ్రహీం, గడ్డం ప్రకాష్‌దాసు, అందుగుల ఏసుపాదం, పాల్గొన్నారు.

# థాంక్యూ సీఎం సార్..

## పట్టణ ముస్లిం మైనార్టీ వర్గాలకు జగనన్న కానుక
## రూ. 9 కోట్ల విలువైన 20 సెంట్ల స్థలం మస్జిద్ కు కేటాయింపు
## పాతికేళ్ల నిరీక్షణ..మంత్రి అంబటి చొరవతో సాకారం
## ఎన్ఎస్పి కాలనీ మస్జిద్ వద్ద ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలపనున్న ముస్లిం సోదరులు.
## హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ముస్లిం మైనార్టీ నాయకులు.



సత్తెనపల్లి: ప్రజాపాలన ప్రతినిధి: పట్టణ పరిధిలోని ఎన్ఎస్పి కాలనీ లోని రూ .9 కోట్ల విలువైన 20 సెంట్ల స్థలాన్ని మస్జిద్-ఇ-అఖ్సా కు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రి మండలి బుధవారం తీర్మానం చేసింది. 25 సంవత్సరా లుగా ఇక్కడ తాత్కాలిక షెడ్డులో నమాజు చేసుకుంటున్న లిముస్లిం సోదరుల వినతి మేరకు రాష్ట్ర జల వనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇన్నేళ్ల నిరీక్షణను మంత్రి అంబటి సాకారం చేయడంతో ముస్లిం మైనార్టీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి థాంక్యూ సీఎం సార్" అంటూ తమ ఆనందాన్ని, హర్షాన్ని వెలిబుచ్చుతున్నారు.

**పాతికేళ్లగా కొనసాగుతున్న ప్రార్ధనలు**

పులిచింతల ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న ముస్లిం ఉద్యోగులు సత్తెన పల్లి పట్టణంలో ఎన్ఎస్పి కాలనీ వద్ద 20 సెంట్ల స్థలంలో అప్పట్లో నెలకు రూ. 18 అద్దె ప్రాతిపదిక ముస్లింలు నమాజ్ నిర్వహించుకుంటూ వచ్చారు. క్రమంగా తాత్కాలిక నిర్మాణము, ప్రహరీ గోడ ఉద్యోగులే వారి సొంత ఖర్చుతో నిర్మించుకున్నారు. మున్సిపాలిటీ నుంచి మంచి నీటి వసతి లభించింది. ప్రతిరోజు సుమారు రెండు వందల మంది ప్రార్థనలకు హాజరవుతుండగా, శుక్రవారం ఇతర పండుగ దినాలలో 500 నుంచి 600 మంది నమాజ్ చదువుకునేందుకు ఇక్కడికి వస్తున్నారు.

**మంత్రి అంబటి రాంబాబు కృషి**

పులిచింతల ప్రాజెక్టు ఉద్యోగులతో పాటు స్థానికంగా ఉన్న ఇతర ఉద్యోగులు కూడా ఈ మసీదుకు నమాజు కోసం హాజరవుతున్నారు. వీరు మస్జిద్-ఇ-అఖ్సా వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కమిటీ ఏర్పడి ఈ స్థలాన్ని మసీదు కోసం కేటాయించాలని మంత్రి అంబటికి విన్నవించారు. ముస్లిం మైనార్టీ సామాజిక వర్గాలకు వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి అండగా ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డి సైతం అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. ముస్లిం సోదరులకు వినతి మేరకు మంత్రి అంబటి రాంబాబు కృషితో ఈ స్థలాన్ని వారికి ప్రభుత్వం కేటాయించింది. మసీదు కమిటీ వ్యక్తిగత భాగస్వాగంగా రూ. ఒక లక్ష లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది.

**హర్షం వ్యక్తం చేస్తున్న ముస్లిం సోదరులు**

రూ.9 కోట్ల విలువైన స్థలాన్ని మంత్రి అంబటి రాంబాబు చొరవతో రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో తీర్మానం చేసి, మంజూరు చేయడం పట్ల ముస్లిం సోదరులు, నేతలు హర్షవ్యక్తం చేస్తున్నారు. మంత్రి అంబటి కృషిని ప్రశంసిస్తూ, ఆయనకు అండగా ఉంటామంటున్నారు. థాంక్యూ సీఎం సార్ తమ సంతోషం వెలిబుచ్చుతున్నారు.

## కృత్రిమ వర్షాలపై విద్యార్థులకు అవగాహన



నరసాపురం, జూన్ 7 (ప్రజాపాలన ప్రతినిధి) : స్థానిక ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా బుధవారం విద్యార్థిని విద్యార్థులకు సీనియర్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ప్రిన్స్ ప్రవీణ్ క్లౌడ్ సీడింగ్ ద్వారా కృత్రిమ వర్షాలు ఎలా పడతాయి అనే అంశంపై వివరించారు. క్లౌడ్ సీడింగ్ అనగా మనకు అవసరమైనప్పుడు కృత్రిమ వర్షాలు పడేటట్లు చేయడమని మేఘమథనం అనే ప్రక్రియ ద్వారా 1902 లో చార్లీ హాక్విల్డ్ అనే శాస్త్రవేత్త 23 రకాల రసాయనాలను పెద్ద ట్యాంకర్లలో కలిపి వాటి యొక్క ఆవిరిని గాలిలోకి వదిలి మొట్ట మొదటిసారిగా ఆయన కృత్రిమంగా వర్షాలను కురిపించి అప్పట్లో గొప్ప సంచలనాన్ని సృష్టించారని విద్యార్థులకు తెలిపారు. మేఘాల రకాలు, కృత్రిమ వర్షాల పద్ధతులను గూర్చి వారికి వివరించారు. బాలబాలికలకు అత్యంత ఇష్టమైన అంశం అంతరిక్షంలో చంద్రమండలం మీద మొట్ట మొదటిగా అడుగుపెట్టిన నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ గురించి వారికి అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం హిందీ మాస్టారు భట్టిప్రోలు సత్యనారాయణ హిందీ క్లాసులలో శిక్షణ, చిత్రకారుడు తోట శ్రీనివాస్ చిత్రలేఖనంలో, టీచర్ గెల్లి శ్రీనివాస్ యోగాసనాలు, జీవన్ కుమార్ పాటల పోటీలు, టీచర్ నాగలక్ష్మి రివిజన్ క్లాసులు, టీచర్ సిహెచ్ శ్రీనివాస్, సూర్యంబాబు నిర్వహించగా ఎన్.విక్టర్ రాజు గూగుల్ డాన్స్ క్లాసులలో బాల బాలికలకు శిక్షణ ఇచ్చారు భట్టిప్రోలు సత్యనారాయణ బాల బాలికలకు స్వీట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సుబ్బారావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావును కలిసిన లైసెన్స్ ఇంజనీర్స్



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూన్ 7 (ప్రజా పాలన ప్రతినిధి): లైసెన్సుడ్ ఇంజనీర్స్ మర్యాదపూర్వకంగా నరసరావుపేట నూతన మునిసిపల్ కమిషనర్ ఎం రామ్మోహన్ ని కలిసి సన్మానించారు. ఇంజనీర్స్ వృత్తిలో ఉన్న సమస్యల మీద చర్చించడం జరిగింది . ఈ సందర్భంగా కమీషనర్ లైసెన్సుడ్ ఇంజనీర్స్ కు వృత్తి పరంగా ఎమన్నా సమస్యలు ఉంటె వెంటనే పరిష్కరిస్తాము అని హామీ ఇవ్వడం జరిగింది .. , ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ లైసెన్సుడు ఇంజనీర్స్ %డ% సర్వేయర్ల సంక్షేమ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి కొమ్మసాని కమలాకర రెడ్డి, పట్టణ ప్రణాళిక విభాగపు అధికారి ఎం వి నరసింహారావు, గుంటూరు జిల్లా ఇంజనీర్స్ సంఘం ఉపాధ్యక్షుడు బి . వెంకట నారాయణ , నరసరావుపేట ఇంజనీర్స్ సంఘ కార్యదర్శి బి. శ్రీనివాస సింగ్ , కోశాధికారి జి . అనిల్, ఎస్ లక్ష్మీకాంత్ , వి వేణుగోపాల్ , జి పి రంగయ్య , ఎం ఆంజనేయులు పాల్గొన్నారు ..

## గతంలో జగన్ గుడివాడకు వచ్చింది క్యాసీన్ ప్రారంభానికి, నేడు మౌళిక వసతులేని టిడ్కో ఇల్లు ప్రారంభానికి రావడం భాదకరం: మాజీ ఎమ్మెల్యే రావి



గుడివాడ : గుడివాడలో జరిగే కార్యక్రమలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రావడం అదృష్టమో, నష్టం అర్థం కావడం లేదని, గతంలో ముఖ్యమంత్రి హోదాలో వచ్చి క్యాసీన్ ప్రారంభించడం, ఈ నెల 9న గుడివాడ ప్రజలు 4సం॥లుగా 85శాతం పూర్తి అయిన టిడ్కో ఇల్లు నేడు రంగులు మార్చి మౌళికవసతులేకండా ప్రారంభించడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో అయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేది గురువారం స్థానిక శోభన కాంప్లెక్స్‌లో భవిష్యత్తుకు గ్యారంటీపై అవగాహన సదసును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మినీ మేనిఫెస్టోలో అంశాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, ఈ ప్రభుత్వం వారిని ఎలా మోసం చేస్తుందో తెలియజేసే కార్యక్రమంను ప్రారంభిస్తామన్నారు. ఈ నెల 9వ తేదిన గుడివాడలో టిడ్కో గృహాలు పంపిణికి రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి లబ్ధిదారుడు పాల్గొని, మౌళిక వసుతులు లేకపోతే ఎలా ప్రశ్నించాలన్నారు. 8912 మంది లబ్ధిదారులో 1800 మందిని ఎందుకు తొలగించరో అక్కడ సభలోనే జగన్‌ను ప్రశ్నిచాలన్నారు. మీరు వస్తునరని అధికారులు, మీ ఎమ్మెలేలు ఇప్పుడు అరకోర రొడ్లు, విత్యుత్ పనులు చేశారని, మీరు వెళ్ళిన తరువాత ఎక్కడి వేసిన గొగంళి అక్కడే ఉంటుందని, పనులు పూర్తి చేసి మాకు అప్పుగించేల చర్యలు తీసుకోవలని లబ్ధిదారులు పశ్నించాలన్నారు. 4సం॥ల క్రితం కేంద్ర ప్రభుత్వం గైడెలైన్సు ప్రకారం అధికారులు పంపిణి చేస్తే నేడు మా ఇల్లు ఎందుకు ఇవలేదని ప్రశ్నిడం మీ భాద్యతన్నారు. 1800 మంది లబ్ధిదారుల కోసం పోరాట చేయడం చేయడానికి నేను సిద్ధం ఉన్నన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ కాకర్ల సుభాస్‌చంద్రబోసు(సురేష), తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గోవాడ శివా, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళీ, నాయకులు పంద్రాజు సాంభయ్య, మజ్జాడ నాగరాజు, మెరుగుమాల బ్రహ్మయ్య, దారపురెడ్డి శేషు, సమ్మెట బ్రహ్మాజీ, అడుసుమిల్లి మోహనరావు, షేక్ కరీముల్లా, దాసు శ్యామ్‌ప్రసాద్, శొంఠి నాగేశ్వరరావు, ఆదినారయణ తదితరులు పాల్గొన్నారు.




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
గురువారం 08, జూన్ 2023

## భారత యువతలో నైపుణ్య లేమి?

ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం భారత్. భారత జనాభాలో సుమారు 65 శాతం 28 సంవత్సరాల లోపు వారే అని వర్క్ ఫోర్స్ గణాంకాలు చెబుతున్నాయి. ఆ మాటకు వస్తే, 45 శాతం జనాభా 25 సంవత్సరాల లోపు వారే. వీరందరూ భారత్ భవిష్యత్తును మార్చడంలో క్రియాశీలకంగా మారనున్నారు. అయితే, వీరు చదివిన చదువుకు, చేసే ఉద్యోగానికి సంబంధం లేకుండా ఉండటం గమనార్హం. అంటే చేసే పనికి కావలసిన నైపుణ్యాలు లేక, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు.మనదేశంలో యువకుల చదువులకు అకడమిక్ రికార్డు పరంగా మంచి మార్కులు, గ్రేడ్లు వస్తున్నాయి. కానీ తదుపరి జీవన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకొనుటలో నైపుణ్యాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కొరవడుతున్నది. దీంతో వారు నిరుద్యోగంతో బాధపడుతున్నారు. యువతలో చదువు (అకడమిక్)- నైపుణ్యాలు - నాలెడ్జ్ ఈ మూడు అంశాల మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడంలో వెనుకబడుతున్నారు. ఈ గ్యాప్స్ ఎంత త్వరగా పూడ్చడానికి చర్యలు తీసుకుంటే, అంత త్వరగా ప్రపంచ మార్కెట్లను అందిపుచ్చుకొని వారితో పాటు, దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరవేయగలరు.సింగపూర్, దక్షిణ కొరియా వంటి అభివృద్ధి చెందిన దేశాలు తమ దేశాల యువతకు భవిష్యత్తు అవసరాలను తీర్చే నైపుణ్యా లు, నాలెడ్జ్ అందిస్తున్నాయి. తద్వారా ప్రపంచ మార్కెట్లను అందిపుచ్చుకుని, అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉండే విధం గా తర్ఫీదు ఇస్తున్నారు. అదే విధంగా, ఫిన్లాండ్ దేశం కూడా ఆ దేశ యువతకు వివిధ పరిశ్రమలకు అవసరమైన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కలిగిన చదువును, నైపుణ్యాలను అందిస్తున్నది. వారికి టీవీఈటీ ద్వారా ప్రపంచ మార్కెట్లో నిలబడే విధంగా తర్ఫీదు ఇస్తున్నది. ఇటువంటి దేశాల ఒరవడిని మనదేశ యువతకు మన పాలకులు, ప్రభుత్వాలు అందించాలి. అప్పుడే ప్రపంచ వ్యాప్తం గా అన్ని రంగాల్లో మన యువత తమ మేధోమథనం ద్వారా భారత ఆర్థిక అభివృద్ధికి వెన్నెముకగా నిలబడగలరు. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో ఒకేషనల్ శిక్షణను అభివృద్ధి పరచాలి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవాలి. ఈ 21వ శతాబ్దపు ఆధునిక కాలంలో ముఖ్యంగా ఆటోమేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, జీ-పాట్ వంటి నూతన చదువులు, విధానాలు అన్నింటా ఆధిపత్యం వహిస్తున్న ప్రస్తుత తరుణంలో మనదేశ విద్యా విధానంలో సాంకేతిక పరిజ్ఞానానికి, నైపుణ్యాల అభివృద్ధికి పెద్ద పీట వేయాలి. అంతే కానీ, కాలం చెల్లిన మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు బలపరిచే చదువులకు చోటివ్వరాదు. సైంటిఫిక్ టెంపర్‌ను ప్రోత్సహించే చదువులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఇక కొవిడ్ అనంతరం ప్రపంచ వ్యాప్తంగా అనేక రకాల మార్పులు చోటు చేసుకున్నాయి. కొత్త కొత్త చదువులు, రంగాలు రంగప్రవేశం చేశాయి. ముఖ్యంగా నర్సింగ్, బ్యూటీ, వెల్‌నెస్, ఇంటర్ నెట్ సేవలు, ఆన్ లైన్ వ్యాపారాలు, మార్కెట్లు సాఫ్ట్‌వేర్ రంగాలు, యానిమేషన్, గిగ్, మూన్ లైట్‌నింగ్, అంతరిక్ష పర్యాటకం, టూరిజం, పర్యావరణం, రెన్యూవబుల్ ఎనర్జీ ఇలా అనేక నూతన ఉద్యోగ ఉపాధి అవకాశాలు ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా మహిళలు, పురుషులు ఉద్యోగాలు అందిపుచ్చుకుంటున్నారు. ఆ మాటకు వస్తే, 2022 ఇండియా స్కిల్ రిపోర్ట్ నివేదిక ప్రకారం మనదేశంలో స్త్రీలు 52.8 శాతం ఈ నూతన రంగాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకున్నారు.పురుషులు కేవలం 47.2శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందారు. బ్యూటీ వెల్‌నెస్ వంటి మార్కెట్ లో 2018 నాటికి భారత్ వాటా 901.07 బిలియన్ల అమెరికన్ డాలర్లు ఉండగా, 2024 నాటికి 2,463.49 బిలియన్ డాలర్ల వాటా ఉంటుందని ప్రపంచ ఆర్థిక సంస్థలు అంచనా వేస్తున్నాయి. అనగా 2019-2024 మధ్య కాలంలో 18.40 శాతం పెరుగుదల ఈ వ్యాపార రంగాల్లో ఉంటుందని తెలిపారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మన యువత నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా కమ్యూనికేషన్, టీం వర్క్, సాఫ్ట్ స్కిల్స్, ఇంటెలిజెన్స్ వంటి వాటిని ఆకళింపు చేసుకోవాలి. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ఇటీవల ప్రకటించిన నివేదిక ప్రకారం 2030 నాటికి భారత్ లో సుమారు 29 మిలియన్ల యువత నైపుణ్యలేమితో ఇబ్బంది పడతారని తెలిపారు. అందుచేతనే, ఇకనైనా చదివిన చదువుకు, అకడమిక్ పరిజ్ఞానంతో పాటు, నైపుణ్యాలు సాధించాలి. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను ఏర్పాటు చేసి, శిక్షణ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఇంకా ప్రభుత్వాలు విద్యా రంగంలో మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ సదుపాయాలు ఏర్పాటు చేయాలి. అప్పుడు మాత్రమే మనదేశానికి వరంగా ఉన్న యువ జనాభా, భవిష్యత్తులో భారత్ ను అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరవేయగలరు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి బడ్జెట్లో నిధుల కేటాయింపులు పెంచాలి. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. ఉపాధ్యా య, అధ్యాపక ఖాళీలు భర్తీ చేయాలి. రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కు ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రంథాలయాలు, లేబరేటరీలు అభివృద్ధి పరచాలి. శాస్త్ర సాంకేతిక చదువులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.అన్ని రంగాల్లో పేటెంట్ హక్కులు చేజిక్కించుకునే విధంగా మన విద్యావ్యవస్థను నిర్మించాలి. భవిష్యత్తులో ప్రపంచ మార్కెట్లను మన ఆధీనంలో ఉండే విధంగా మన యువత నైపుణ్యాలు అందిపుచ్చుకొని, ఉద్యోగ ఉపాధి అవకా శాలతోపాటు, వ్యాపార రంగా ల్లో సత్తా చాటాలి. 500 ట్రిలియ న్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపొందే క్రమంలో క్రియాశీలక పాత్ర పోషించాలి.


## రాజదండం వెనుక కట్టు కథ !

ఆగస్టు 14వ తేదీ రాత్రి పొద్దుపోయిన




రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించాలంటూ కొత్తగా నియమితుడైన రాజుకు సాంప్రదాయంగా ప్రధాన మత గురువు అందించే రాజదండమే ఇది. ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రజాస్వామ్య రిపబ్లిక్‌లో ఇటువంటి భావనకే స్థానం లేదు. పైగా పార్లమెంట్‌లో ప్రధాన స్థానంలో ఇటువంటి మతపరమైన చిహ్నాన్ని వుంచడమనేది లౌకిక ప్రజాస్వామ్య రిపబ్లిక్ స్వభావానికే పూర్తి విరుద్ధం. మే28న కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని 20 ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించాయి. ప్రభుత్వ, పార్లమెంట్ అధినేత అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పక్కకు పెట్టి కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆ కారణంతోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించాయి. ప్రభుత్వ అధినేతను పార్లమెంట్‌పై బలవంతంగా రుద్దుతూ రాజ్యాంగపరంగా తీసుకున్న అనౌచిత్య చర్య ప్రతిపక్షాల నిరసనకు చట్టబద్ధమైన కారణంగా వుంది. వాస్తవానికి ప్రారంభోత్సవం రోజున జరిగిన పరిణామాలు ఈ కార్యక్రమానికి దూరంగా వుండాలన్న ప్రతిపక్షాల నిర్ణయాన్ని మరింత బలపరిచాయి. ఆనాడు వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటన్, జవహర్‌లాల్ నెహ్రూకు అధికారాల బదలాయింపునకు గుర్తుగా అందచేసిన రాజదండాన్ని పార్లమెంట్ లోపల నెలకొల్పనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా అకస్మాత్తుగా ప్రకటించారు. అమిత్ షా మాటల్లో చెప్పాలంటే, "పండిట్ జవహర్ లాల్ నెహ్రూకు రాజదండాన్ని అప్పగించడం ద్వారా భారతదేశ అధికార బదలాయింపు జరిగింది.'' అని పేర్కొన్నారు. ఆ రకంగా బ్రిటీష్ వారి నుండి కొత్త ప్రభుత్వానికి 'అధికార బదలాయింపు'ను సూచించేలా హిందూ మతపరమైన కల్పిత కథనం రూపొందించబడింది. అధికార బదిలీని ప్రతిబింబించేలా భారతీయ కార్యక్రమం ఏదైనా వుందా అని లార్డ్ మౌంట్‌బాటన్, జవహర్‌లాల్ నెహ్రూను అడిగినట్లు అధికారికంగా తెలియచేయబడింది. అప్పుడు నెహ్రూ, కాంగ్రెస్ నేత రాజగోపాలాచారిని దీని గురించి సంప్రదించగా, ఆయన తమిళనాడు లోని మతపరమైన మఠాలను సంప్రదించి, అధికార బదిలీకి ప్రతీకగా రాజదండం వుండాలని సూచించారు. రాజ్యాంగ నిర్ణాయక సభ అధికారిక సమావేశానికి ముందుగా ఆగస్టు 14వ తేదీ రాత్రి లార్డ్ మౌంట్‌బాటన్ ఆ రాజదండాన్ని నెహ్రూకు అందచేశారని తెలియచేయబడింది. అయితే, రాజదండం గురించి అసలు వాస్తవం, చరిత్ర ఏమిటి? అధికార బదిలీకి ఉపయోగించే గుర్తు గురించి మౌంట్‌బాటన్, నెహ్రూను అడిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేదా రికార్డులు లేవు. అసలు ఈ విషయంలో రాజాజీ పాత్ర వుందన్నట్లుగా కూడా ఎలాంటి ఆధారం లేదు. వాస్తవానికి, మౌంట్‌బాటన్, నెహ్రూకు రాజదండాన్ని అందచేయలేదు. ఆగస్టు 13వ తేదీ సాయంత్రం మౌంట్‌బాటన్ కరాచి వెళ్ళారు. తిరిగి తర్వాత వచ్చారు. తమిళనాడు లోని శైవ మఠం ఆధ్వర్యంలో ఈ దండం తయారుచేయబడింది. దాన్ని ఢిల్లీకి తీసుకువచ్చి 14వ తేదీ రాత్రి నెహ్రూ నివాసంలో ఆయనకు అందచేశారు. దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక కార్యక్రమం లేదు, ఇదంతా కేవలం అనధికారిక వ్యవహారం మాత్రమే, ఇతర అనేక బహుమతు ల్లాగానే దీన్ని కూడా నెహ్రూ స్వీకరించారన్నది వాస్తవం. తర్వాత దాన్ని అలహాబాద్ మ్యూజియంలో పెట్టారంటేనే నెహ్రూ ఆ విషయాన్ని ఎలా చూశారన్నది అర్థమవుతోంది. 14వ తేదీ రాత్రి ఈ రాజదండాన్ని అప్పగించడం ద్వారా అధికార బదిలీ జరిగిందంటూ కట్టు కథలు చెప్పడాన్ని చూస్తుంటే, హిందూ రాజ్యాన్ని పునరుద్ధరించడం ద్వారా శతాబ్దాల తరబడి సాగిన బానిసత్వ పాలన ఎలా అంతమొందించబడిందో చెప్పడానికి ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి అల్లిన కథనానికి సరిపోతుంది. ఆనాటి నేతలకు కల్పిత పాత్రలను అంటగడుతూ చారిత్రాత్మకంగా దీనికో కథనాన్ని కల్పించడం ద్వారా అధికార బదిలీ కార్యక్రమానికి హిందూ మతం రంగు పులమగలిగారు. ఈ రాజదండం అధ్యాయం కల్పిత గాథను రూపొందించింది ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతికవేత్త ఎస్.గురుమూర్తి. 2021లో తమిళ పత్రికలో దీని గురించి ఆయన రాశారు. మే 28వ తేదీ ఉదయం ఈ రాజదండాన్ని పట్టుకుని ప్రధాని నరేంద్ర మోడీ మత గురువులు, మఠాధిపతుల ప్రదర్శనకు ముందు నడవడం, దాన్ని లోక్‌సభలో సభాపతి కుర్చీ వెనుక ప్రతిష్ఠించడమన్నది, హిందూ దేశాన్ని అనుకరిస్తూ కొత్త భారతదేశాన్ని ప్రతిష్ఠించడంలో భాగంగానే వుంది. ఇది లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్ భావజాలానికి పూర్తి విరుద్ధం. రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించాలంటూ కొత్తగా నియమితుడైన రాజుకు సాంప్రదాయంగా ప్రధాన మత గురువు అందించే రాజదండమే ఇది. ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రజాస్వామ్య రిపబ్లిక్‌లో ఇటువంటి భావనకే స్థానం లేదు. పైగా పార్లమెంట్‌లో ప్రధాన స్థానంలో ఇటువంటి మతపరమైన చిహ్నాన్ని వుంచడమనేది లౌకిక ప్రజాస్వామ్య రిపబ్లిక్ స్వభావానికే పూర్తి విరుద్ధం. వి.డి.సావర్కర్ జయంతి అయినందునే మే 28వ తేదీని కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి ఎంచుకున్నారు. కొత్త భారతదేశం ఎలా నిర్మించబడుతుందో చెప్పడానికి ఇది కూడా ఒక సంకేతం. తొలుత స్వాతంత్ర్య సమరయోధునిగా పోరాటం మొదలుపెట్టిన సావర్కర్ తదనంతర కాలంలో అండమాన్ సెల్యులార్ జైలు నుండి విడుదలైన తర్వాత బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా తన పోరాటాన్ని విరమించుకున్నాడు. పదే పదే క్షమాభిక్ష కోరుతూ పిటిషన్లు పెట్టుకున్న అనంతరం ఆయనను జైలు నుండి విడుదల చేశారు. ఇక ఆ తర్వాత పూర్వపు పాలకులు, ముస్లింలకు వ్యతిరేకంగా పోరాటం జరపడంపై, హిందుత్వాన్ని పునరుద్ధరించడంపై ఆయన తన దృష్టిని మరల్చాడు. ఆయన హిందుత్వ భావనను సమర్థించిన బిజెపి పాలకులు, వేలాది సంవత్సరాల బానిసత్వ పాలనను అంతమొందించడమే హిందూ రాష్ట్ర స్థాపనగా చూశారు. అదే రోజున, కొత్త పార్లమెంట్ భవనానికి కొద్ది వందల మీటర్ల దూరంలోనే శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న మహిళా రెజ్లర్లను పోలీసులు దారుణంగా ఈడ్చుకెళుతూ అరెస్టు చేశారు. దీంతో ఈ రాజదండం ధర్మపాలనను ప్రతిబిం బిస్తుందన్న బిజెపి పాలకుల వాదన ఘోరంగా దెబ్బ తింది. ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొంటున్న నూతన భారతదేశ చిహ్నాలు...అయోధ్యలో రామాలయ నిర్మాణం, సెంట్రల్ విస్టా, కొత్త పార్లమెంట్ భవనం...ఇవన్నీ కొత్త నిరంకుశ హిందూత్వ రాజ్య లక్షణాలుగా వున్నాయి. ఈ భాష్యానికి అనుగుణంగా చరిత్రను వక్రీకరించడం, సృష్టించడం చేస్తున్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టం ఎక్కడ?



కార్పోరేట్ స్కూళ్లలో ఫీజుల మోత మోగుతోంది. ఇది ఏటా విద్యార్థుల తల్లిదండ్రులకు భారమవుతోంది. విద్యాశాఖాధికారులు గానీ, ప్రభుత్వం గానీ ఆ స్కూళ్లపై చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ఫీజులను కట్టడి చేస్తామంటూ తొమ్మిదేళ్ల నుంచి చెబుతున్న మాటలను ప్రభుత్వం ఆచరణలో పెట్టడం లేదు. ప్రొ. తిరుపతిరావు కమిటీ అంటూ కొన్ని రోజులు, మంత్రుల కమిటీ అంటూ కొన్ని రోజులు ప్రభుత్వం కాలయాపన చేసింది. చివరికి ఈ కమిటీలు ఇచ్చిన సిఫారసులను పక్కన పెట్టింది. దీంతో స్కూళ్ల యాజమాన్యాలు ఫీజులు మళ్లీ ఎంత పెంచుతారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో 10,700 పైచిలుకు కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ ఉండగా, వీటిలో దాదాపు 32 లక్షల మంది చదువుతున్నారు. ఈ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల కోసం వెళ్లిన తల్లిదండ్రులకు ఫీజులు చూస్తే దిమ్మ తిరుగుతోంది. గత సంవత్సరం ఫీజు కంటే 25 నుంచి 50 శాతం వరకు ఫీజులు ప్రైవేట్ సూళ్లు పెంచుతున్నాయి. స్కూళ్ల స్థాయి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఫీజులు పెంచుతున్నారు. ఆఖరికి పుస్తకాలు, బూట్లు, టై, బెల్ట్ వరకు ఇష్టం వచ్చినట్లు రేటు పెట్టి అమ్ముతున్నారు. నిజానికి స్కూళ్ల పరిధిలో ఇవి అమ్మకూడదనే ప్రభుత్వ నిబంధన ఉన్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. కొన్ని స్కూళ్లకు మౌలిక సదుపాయాలు లేకపోయినా అధికారులు అనుమతులు ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై 2017 మార్చ్ నెలలో ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో కమిటీ వేసింది. ఆ కమిటీ వివిధ రాష్ట్రాల్లోని స్కూళ్లలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అందులో ఏటా 10 శాతం ఫీజు పెంచుకోవచ్చని ప్రతిపాదించింది. అయితే ఫీజుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించింది. స్కూల్ ఫీజుల పెంపును నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ చట్టం చేయాలని నిర్ణయించింది. 2022 జనవరి 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో 11 మంది మంత్రులతో ఫీజు నియంత్రణకు విధివిధానాలు రూపొందించేందుకు ఉపసంఘాన్ని నియమించింది. ఈ కమిటీ కూడా ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్‌లో 10 శాతానికి మించి ఫీజు పెంచడానికి వీలులేదని సిఫారసులు చేసింది. వీటిపై ప్రత్యేక చట్టం చేసేందుకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలి. కానీ ఆ ప్రయత్నం జరగలేదు. ప్రత్యేక చట్టం చేయాలని విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ అసోసియేషన్ నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వ పెద్దలు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి ఏ విద్యా సంస్థనైనా ట్రస్ట్ పేరిట నడపాలి. దానికి ఒక గవర్నమెంట్ బాడీ ఏర్పాటు చేయాలి. అయితే కార్పొరేట్ పాఠశాలలో నామమాత్రంగా గవర్నమెంట్ బాడీ చూపిస్తున్నా, అధికారం మొత్తం యాజమాన్యం చేతుల్లో ఉంటోంది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణలో ఉండేటట్టు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## జగనన్న కాలనీ లేఅవుట్ ప్లాట్లు చూపిస్తున్న అధికారులు



రైల్వే కోడూరు :ప్రజాపాలన ప్రతినిధి: అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లి మండలం ఓబుళవారిపల్లి పంచాయితీ లో కొత్తగా జగనన్న కాలనీ లేఔట్ ఇవ్వడం జరిగింది. ఇందులో మొత్తం 96 ప్లాట్స్ కి గాను 68 ప్లాట్లు మంజూరు అయ్యాయి ఇందులో భాగంగా లబ్దిదారులందరిని లేఔట్ కి పిలిపించి వారికి ఇచ్చిన ప్లాట్లను చూపించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఓబుళవారి పల్లి ఎంపీడీవో ఎస్ విజయరావు హాజరు అయ్యి లబ్దిదారులతో మాట్లాడుతూ అందరూ కూడా తొందరగా ఇంటి నిర్మాణలు చెప్పట్టాలని అలాగే వారికి కావలసిన మెటీరియల్ సిమెంట్, స్టీల్ మరియు ఇసుక సకాలంలో అందించాలని అక్కడ ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ నంద కిశోర్ ని అదేశించారు.అలాగే ఎవరికైనా డబ్బులు ఇబ్బందిగా ఉంటే వారికి డ్వాక్రా ద్వారా 35000 రూపాయలు ఇప్పించడం జరుగుతుంది అని లబ్దిదారులకు తెలపడం జరిగింది... ఈ కార్యక్రమంలో ఏపిఎం ఆర్ముగం, హౌసింగ్ ఏ ఈఎం. ఓబులేసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నంద కిషోర్, వర్క్ ఇన్స్పెక్టర్ పి. రామకృష్ణ, బాదుల్ల పాల్గొన్నారు...

## పాద యాత్రికునికి అండగా జిల్లా ప్రముఖులు

### ఘనంగా సాగనంపిన శ్రీకాకుళం ఎన్జీవోస్






శ్రీకాకుళం ప్రజాపాలన ప్రతినిధి: :శ్రీకాకుళం – పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ఉత్తరప్రదేశ్ సుల్తాన్ పూర్ కి చెందిన అశు తోష్ పాండే అయోధ్యరామ నుండి దేశయాత్ర చేస్తూ, మంగళవారం శ్రీకాకుళం చేరుకొని జిల్లా ఎస్పీ ని కలసిన విషయం విదితమే. ఎస్పీ పాండే ను ఉద్దేశించి పాదయాత్ర విజయవంతం కావాలని పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషి వెలకట్టలేమన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎన్జీవోస్ తో పాటు శ్రీకాకుళం కిమ్స్ వైద్యశాల ప్రముఖ వైద్యులు డా. బాల నరసింహ రావు, పేసెంట్ కేర్ ఇంచార్జ్ ఆర్ భాస్కర్ రావు, ఆపరేషన్ మేనేజర్ జె. కిరణ్ కుమార్, న్యూ శ్రీకాకుళం బ్లెడ్ బ్యాంకు లో ఉన్న పాండే ను కలసి దేశం కోసం చేస్తున్న సేవలకు గాను బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా. మణికంఠ, అడ్మిన్ ప్రతాప్ ఆధ్వర్యంలో అభినందిస్తూ ఒక మొక్కను అందించి, గోల్డ్ మెడల్, శాలువాలతో చిరు సత్కారం చేసి, పాదయాత్రలో ఏ అవసరం వచ్చిన మేము ఉన్నామని, మా సహాయ సహకారాలు మీ పాదయాత్ర చివరి దశ వరకు ఉంటుందని తెలిపారు. అనంతరం పాండేను ఘనంగా సాగనంపారు. ఈ కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ వెంకట రమణ, నంది ఉమా శంకర్, కె.శివ, ఎస్.సతీష్, జిల్ సత్య సాయి, మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజ రౌతు, జెసిఐ గ్రీన్ సిటీ మణిశర్మ, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి పొడుగు చరణ్, శ్రీకాకుళం రోటరీ క్లబ్ జై శ్రీ రామ్, కళింగ వైశ్య సంఘము ప్రతినిధి సుధాకర్, ఎస్.ఎస్.ఎస్. కలివరపు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జున్ స్పోర్ట్స్ షూటింగ్ అకాడమీ ద్వారా ,4వ వార్షిక బహిరంగ పోటీలు



ప్రజాపాలన ప్రతినిధి: అర్జున్ స్పోర్ట్స్ షూటింగ్ అకాడమీ ద్వారా ,4వ వార్షిక బహిరంగ పోటీలో గ్రాండ్ ప్రైజ్ పంపిణీ, సీతమ్మదర, వైజాగ్, దక్షిణ భారతదేశంలోని వివిధ నగరాల నుండి 90 మందికి పైగా షూటర్లు ఈ ఈవెంట్‌లో వివిధ ఈవెంట్‌లలో పాల్గొన్నారు. ముఖ్య అతిథి – – నెల్లి గురుదేవ్ జాతీయ అధ్యక్షుడు, నేషనల్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ న్యూఢిల్లీ, గౌరవ అతిథులు – మూర్తి (ప్రెసిడెంట్–డెక్కన్ డెవిల్స్) శుభం –మాజీ ఆర్మీ షూటర్ విజేతలకు 40 ప్లస్ – పతకాలు అందించబడ్డాయి, అలాగే బహుళ విభాగాల్లో 60కె కంటే ఎక్కువ నగదు బహుమతిని అందించారు. ముఖ్య అతిథి తన ప్రసంగంలో నగరంలో క్రీడను ప్రోత్సహించడానికి క్లబ్ చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు మరియు క్రీడ పట్ల వారి అంకితభావం మరియు నిబద్ధత కోసం తల్లిదండ్రులు మరియు షూటర్లను అభినందించారు!గొప్ప అభినందనలుకుర్రి ఉమా శంకర్ (ఫెలిస్టేషన్ )– డైరెక్టర్ అర్జున్ స్పోర్ట్స్ షూటింగ్ అకాడమీ లి ముఖ్య అతిథి – నెల్లి గురుదేవ్‌జీ నేషనల్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ న్యూ ఢిల్లీ రవికుమార్.P Nfsj సెక్రటరీ , smt kanaka mahalaxmi Nfsj మహిళా విభాగం నాయకురాలు మరియు తల్లిదండ్రులు మరియు సిబ్బంది మరియు మాజీ సైనిక సంక్షేమ సంఘం వ్యక్తులు పాల్గొంటారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు..



గొల్లప్రోలు,:ప్రజాపాలన ప్రతినిధి: ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం భావ్యంగా లేదని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఎఐయఫ్టియు) పిఠాపురం డివిజన్ అధ్యక్షుడు డి.నారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి కుంచె అంజిబాబులు పేర్కొన్నారు.గొల్లప్రోలు మండల పరిధి దుర్గాడ గ్రామంలో బుధవారం కార్మిక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డివిజన్ ప్రధాన కార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోడీ పాలన లోని కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అంచెలంచెలుగా నిధులు తగ్గిస్తు పేదవారిని అణగత్రొక్కడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఇటువంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు నారాయణ మూర్తి మాట్లాడుతూ..200 వందల పని దినాలను కూలీలకు కల్పించి ఆదుకోవాలని కోరారు.అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దిమ్మల లోవరాజు,బత్తిన కుమారి,ఎద్దు నాగమ్మ,సిద్ధాంతపు కొండమ్మ,అయిన విల్లి సూరిబాబు,అంముజాల కామరాజులతో పాటు 50 మంది ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# కరెంటు చార్జీల మోతలు మాకొద్దు...



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: కోతల వాతలు పెట్టొద్దు....ఇకపై జగన్ ప్రభుత్వం బాదుడు మాకొద్దు..... అని ప్రజలు అనుకుంటున్నారు అంటూ జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా ఉపాధ్యక్షులు సుదీర్ పత్తిపాడు మరియూ జనసైనికులతో కరెంట్ ఆఫీస్ ఎస్సీ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. అనంతరం మీడియా మిత్రులతో మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరంలో దాదాపుగా ఎనిమిది సంవత్సరాలు కరెంటు చార్జీలు పెంచింది. కరెంటు చార్జీలు పెంచుకుంటూ సంక్షేమ పథకాల అర్హులను తగ్గించుకుంటూ పోతుంది. ప్రతి బడ్జెట్ కి కరెంటు చార్జీలు పెంచుతారని అధికారులు చెప్పారు,కానీ బడ్జెట్ నాలుగు సార్లు ప్రవేశపెట్టిన దాదాపు 8 సార్లు చార్జీలు పెంచారు. నిరంతరం పేద ప్రజలను ఉద్దరిస్తానన్నట్టు చెప్పుకునే జగన్ ప్రభుత్వం సామాన్యులకి కరెంటు చార్జీల భారం పెంచుతూ పోతుంది.గత ఏప్రిల్ లో టారిఫ్ మార్చి చార్జీలను పెంచి,ఈనెల మొదటి వారం నుంచి కమర్షియల్ యూసేజ్ కి ఏదో అదనపు చార్జీలు యూనిట్ ఒక రూపాయి పెంచి మరింత భారం మోపింది.కరెంటు కోతలను మరిచిపోయిన ప్రజలకు మళ్ళీ కరెంటు కోతలు రుచి చూపిస్తుంది.అనధికారికంగా తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అక్కడక్కడ కొన్ని ప్రాంతాల్లో ఆల్టర్నేట్ గా తీస్తుంది.ఇన్వెర్టర్లను జనరేటర్లు మర్చిపోయిన ప్రజానీకం మరలా వాటి ఏర్పాటు చేసే పని లో పడ్డారు. సామాన్య కుటుంబానికి కూడా వెయ్యి రూపాయలు లోపల వచ్చే కరెంట్ బిల్లు వచ్చే పరిస్థితి లేకుండా చేస్తుంది. దీనిని చాకుగా చూపి సంక్షేమ పథకాలు ఏరువేత పనులో పడింది ఈ వైసిపి ప్రభుత్వం.కరెంటు కోతలను కట్టడి చేసి చార్జర్ల పెంపును నియంత్రణ చేయకపోతే జనసేన పార్టీ తరఫున నిరసనలు ఉధృతం చేసి ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్,జిల్లా ఉపాధ్యక్షులు సుధీర్ బద్దిపూడి,కార్యదర్శి ప్రశాంత్ గౌడ్,హేమచంద్ర యాదవ్, ఖలీల్,నారాయణ,వర్షన్, బాలాజీ,షారూ,ఖాసీఫ్,కేశవ తదితరులు పాల్గొన్నారు.

## 37వ డివిజన్లో ఎమ్మెల్యే కృషితో స్కూల్లు, పార్కు. రోడ్లు. చాలా అభివృద్ధి. చెందుతున్నాయి:చటర్జీ



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం .37వ డివిజన్లో ప్రజా సమస్యలు తెలుసుకొనిపరిష్కరించేందుకు క్షేత్ర స్థాయిలో బుధవారం మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు స్థానిక 37 డివిజన్ కార్పొరేటర్ చటర్జీతోపాటు విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయి అని పరిశీలించడంజరిగిందన్నారు.గాంధీ పార్క్ ను నూతన హంగులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గాంధీజీ,సుందరమ్మ స్కూల్స్ ను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.రోడ్లు కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు.అభివృద్ధే ధ్యేయంగావని చేస్తున్నామన్నారు. అభివృద్ధి పై బహిరంగ చర్చకు సిద్ధం అని అన్నారు.. కార్పొరేటర్ చటర్జీ మాట్లాడుతూ. స్థానిక ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు మరియు విజయవాడ నగర్ మేయర్ సహకారంతో 37 డివిజన్లో చాలా అభివృద్ధి పనులు చేపట్టామని మరియు.స్కూల్. పార్కు చాలా అభివృద్ధి చెందుతుందని.. ఎమ్మెల్యే గారు పూర్తి సహకారంతో ఈ డివిజన్ ఇంకా అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తానని చటర్జీ అన్నారు.. పర్యటన కార్యక్రమం లో., 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవ్ అప్పాజీ., జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి . దుర్గ గుడి ధర్మకర్త బుద్దా రాంబాబు, గ్రంధి రమేష్ , షేక్ జిలానీ , సుంకర శివ ప్రసాద్, రాఘవేంద్ర తదితర డివిజన్ నాయకులూ కార్యకర్తలు సచివాలయం కన్వీనర్లు గృహ సారథులు సచివాలయం సిబ్బంది నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోవిలంపాడులో సమ్మర్ క్లాస్ లు ముగింపు కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జి బ్రదర్స్ ......



పామూరు :ప్రజాపాలన ప్రతినిధి: కనిగిరి నియోజకవర్గం సిఎస్ పురం మండల రథసారథి మా అన్న ఎంపిపి మూడ మంచు వెంకటేశ్వర్లు యాదవ్ ఆదేశాలతో కోవిలంపాడు గ్రామపంచాయతీలోని స్కూల్లో గత 40 రోజులుగా సమ్మర్ ఇంగ్లీష్ కోచింగ్ సెంటర్ ను వేర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సమ్మర్ క్లాసులు ముగింపు కార్యక్రమంలో కోవిలంపాడు సర్పంచ్ బుజ్జీ బ్రదర్స్ పాల్గొని నేటితో పూర్తిచేసి గ్రామపంచాయతీలోని 60 మంది పిల్లలకి చక్కటి ఇంగ్లీష్ కోచింగ్ ఇవ్వటం జరిగింది అన్నారు.గ్రామ పంచాయతీలోని మిత్రుడు వెంకటస్వామి కృష్ణవంశీ సహకారంతో స్కూల్ కమిటీ చైర్మన్ తిరుపతయ్య పర్యవేక్షణలో యేసయ్య మాస్టర్ చక్కటి విద్యను పిల్లలకు అందించారని ప్రశంసించారు. బుజ్జి బ్రదర్స్ మాట్లాడుతూ కోయిలంపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ గా పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి కోచింగ్ సెంటర్ ను మొదలు పెట్టడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం కూడా గ్రామపంచాయతీ ప్రజలకు ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేస్తామన్నారు. కార్య క్రమం లో ,సచివాలయ కన్వీనర్ బల భద్ర జాన్ బాబు, వైఎస్సార్ పార్టీ గ్రామ అధ్యక్షులు కురకుల అంకయ్య యాదవ్, చండులూరి కాశయ్య, స్కూల్ కమిటీ చైర్మెన్ డోల తిరుపతయ్య,మాస్టర్ యసయ్య,బలే రంతు,ప్రభాకర్ పాల్గొన్నారు.

## జగనన్న లేఔట్ లలో విథీ దిపాల ఏర్పాటు చెయ్యాలి



బుచ్చి టౌన్ :ప్రజాపాలన ప్రతినిధి: బుచ్చి నగరంలో జగనన్న పెద్దూరు లేఔట్లలో వీధి ధీపాలు ఏర్పాటు చేయాలని లబ్దిదారులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.జగనన్న లెఔట్లు ఊరికి దూరంగా ఉండటం వల్ల రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది అని పనులకు ఆటంకంగా ఉంటుందని అన్నారు.కొందరు ఆకతాయి మూకలు రాత్రివేళల్లో పూటుగా మద్యం సేవించి దారిలో సీసలు పగలకొట్టి నానా రాద్ధాంతం చేస్తున్నారని వాటి వల్ల గాయాలపాలవుతున్నామని వాపోతున్నారు.అంతేకాక అక్కడ ఏర్పాటు చేసిన నీటి మోటర్లు,ఇళ్ల నిర్మాణ సామాగ్రి దొంగిలించ బడుతుంది అని తెలిపారు. నీటి మోటర్లు తాత్కాలికంగా ఏర్పాటు చేసి ప్రతి రోజు ఉదయం సాయంత్రం వాటిని తమ వెంట తీసుకవెల్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జగనన్న లేఔట్లలో భద్రత కరువైందని ఇప్పుడే ఇలా ఉంటే భవిషత్తులో నివాసాలు ఎలా ఏర్పాటు చేసుకోవాలని వాపోతున్నారు.

## స్ఫూర్తి దాతల పుట్టినరోజుల సందర్బంగా వృద్ధాశ్రమాల్లో అల్పాహారం, భోజన పంపిణీ కార్యక్రమం



డోన్/నంద్యాల జిల్లా :ప్రజాపాలన ప్రతినిధి: స్ఫూర్తి సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలకు చేదోడు వాదోడుగా సాయం అందిస్తున్న స్ఫూర్తి దాతల పుట్టినరోజు శుభ సందర్భంగా బుధవారం నాడు స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు అల్పాహారం భోజన వసతి కల్పించారు. కంబాలపాడు గ్రామానికి చెందిన రాఘవేంద్ర గౌడ్ పుట్టినరోజు సందర్భంగా డోన్ పట్టణంలో గల హెూసన్నా వృద్ధాశ్రమం మరియు ఓబుళాపురం మిట్ట వద్ద గల శ్రీ అవధూత కాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమం నందు గల వృద్ధులకు ఉదయం అల్పాహారం అందించారు. అలాగే హైదరాబాద్ కి చెందిన భాస్కర్ పుట్టినరోజు సందర్భంగా రెండు వృద్ధాశ్రమాల్లోని వృద్దులకు భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వృద్ధులు, నిర్వాహకులు రాఘవేంద్ర గౌడ్ కి, హైదరాబాద్ భాస్కర్ లకు శుభాకాంక్షలు శుభాశీస్సులు అందించి, కార్యక్రమం జరిపిన స్ఫూర్తి టీమ్ కి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు స్ఫూర్తి మధు, రాము, బ్రహ్మానందరెడ్డి, రామాంజినేయులు, అంజి యాదవ్, ఆలా. రాజా హర్షవర్ధన్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## పర్మిషన్ లేని నారాయణ పాఠశాలను సీజ్ చేయాలి



నందికొట్కూరు ప్రజాపాలన ప్రతినిధి: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పర్మిషన్ లేకుండా పాఠశాల నిర్వహిస్తున్న నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని నంద్యాలలోని జిల్లా కార్యాలయంలో డీఈఓ అనురాధ గారికి పిడీస్యూ ఐసా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీ డీ ఎస్ యూ జిల్లా అధ్యక్షులు రాంబాబు ఐసా జిల్లా కార్యదర్శి యస్.నాగార్జున మాట్లాడుతూ... నందికొట్కూరు పట్టణంలో అక్షర శ్రీ స్కూల్ తో పర్మిషన్ తీసుకొని విద్యార్థులను, తల్లిదండ్రులను ఎటువంటి పర్మిషన్ లేకపోయినా నారాయణ విద్యాసంస్థలని దొంగ మాటలు చెప్పి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ... పేరుకు పర్మిషన్ ఏమో అక్షర శ్రీ పాఠశాల కానీ లోపల విద్యాసంస్థలు నడుపుతున్నది మొత్తం నారాయణ యాజమాన్యమే.. కార్పొరేట్ విద్య పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలకు వేలు ఫీజులు దండుకుంటున్నారని మండిపడ్డారు...ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తూ పాఠ్యపుస్తకాలు పాఠశాల పేరుతో ముద్రించిన వాటిని అమ్ముతుండడం జరుగుతుందన్నారు..అనుమతులు లేకుండా తరగతులు యదేచ్ఛగా నిర్వహిస్తున్న ఇక్కడ ఎంఈఓ గారు మాత్రం కాసులకు కక్కుర్తి పడి అరాయణా యాజమాన్యం వత్తాసు పలుకుతున్నారని ఇప్పటికైనా డీఈఓ గారు స్పందించి అక్షర శ్రీ పాఠశాలతో చలామణి అవుతూన్న నారాయణ విద్యాసంస్థను సీజ్ చేయాలని ,పిడిఎస్యు ఐసా విద్యార్థి సంఘాలుగా డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే డీఈఓ ఆఫీస్ ముట్టడికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు సురేష్,శేఖర్,రాజు తదితరులు పాల్గొన్నారు

# జగనన్న కాలనీలో... దళారుల రాజ్యం

**కోట్ల రూపాయల ఖర్చుతో ప్రభుత్వం చేపట్టిన పేదవాడి ఇల్లు కలగానే చేస్తున్న బ్రోకర్లు**

**నరసరావుపేట జగనన్న కాలనీలో జోరుగా ప్లాట్లు అమ్మకం**

**అధికారులు తనిఖీలు నిల్... ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న దళారులు**

**తాసిల్దార్ కానీ , కమిషనర్ గాని కాలనీ వైపు కన్నులెత్తి చూడరు**

**పేదవాడికి ఇచ్చిన సెంటు స్థలాన్ని కూడా వదలని దళారులు**

**పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం**

**జిల్లా కేంద్రంలో ఉన్న జగనన్న కాలనీలో కోట్ల రూపాయలు చేతులు మారుతున్న వైనం**

**కలెక్టర్, జాయింట్ కలెక్టర్ , ఎస్పీ ఉన్న మాకు తిరిగే లేదంతు వ్యవహరిస్తున్న దళారులు**

**1,20,000 నుండి 2 లక్షల వరకు ఫ్లాట్ అమ్మకాలు**

**ఇంత జరుగుతున్న పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం**

**ఇల్లు కట్టిస్తామంటూ లక్షల వసూలు చేసి ముఖం చాటేస్తున్న దళారులు**





పల్నాడు జిల్లా బ్యూరో. నరసరావుపేట. జూన్ 7 (ప్రజా పాలన ప్రతినిధి): కోట్ల రూపాయలు చెయ్యి మారుతున్న అధికారులు మాకెందుకులే అంటూ పట్టినట్టుగా వ్యవహరిస్తున్నారు దీంతో జగనన్న కాలనీలో దళారుల రాజ్యమేలుతున్నారు నరసరావుపేటలో కూతేటు దూరంలో ఉప్పలపాడు వద్ద 7000 మందికి పేద వర్గాలకు చెందిన వారికి జగనన్న కాలనీలో ప్లాట్లు వేసి పట్టాలు మంజూరు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలతో పొలాలను కొని ఇల్లు లేని నిరుపేదలకు పట్టాలిచ్చి ప్రభుత్వం నుండి 1,80,000 ఇల్లు కట్టుకొని సుఖ సంతోషాలతో ఉండాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టింది అయితే కొంతమంది దళారులు పేదవారికి ఆశ చూపించే 1,20,000 నుండి రెండు లక్షల వరకు ప్లాట్ అమ్ముతూ కాలనీలో మా రూటే వేరు అంటూ వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితర జిల్లా అధికారులు ఉన్న జగనన్న కాలనీలో ప్లాట్లు అమ్మకం మాత్రం యధావిధిగా జరుగుతున్నాయి. ఈ జగనన్న కాలనీలో పట్టించుకునే నాధుడే కరువయ్యాడు నరసరావుపేట తాసిల్దార్ కానీ , నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ గాని తనిఖీలు చేయకపోవడంతో దళారులు ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తున్నారు .ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యవధితో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుంటే అధికారులు మాత్రం వాటిని పేదలకు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎంతోమంది పేదవారు అద్దెలకుండీ ఇంటి అద్దె కట్టలేక ఇబ్బందులు పడుతుంటే వైయస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదవాడి సొంతింటి కలనం నెరవేర్చటానికి కోట్ల రూపాయల ఖర్చుతో పొలాలు కొనుగోలు చేసి ప్లాట్లుగా తయారుచేసి ఊళ్లుగా నిర్మిస్తున్నాడు. కొంతమంది దళారులు జగనన్న ప్లాట్లు ల లో ఇల్లు మేమే కట్టిస్తామంటూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు .పేదవారిని ఇబ్బందులు గురి చేస్తున్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకోకుండా జగనన్న కాలనీ వైపు కన్నెత్తి చూడటం లేదు. దాదాపు కాలనీలో 1000 ప్లాట్లు అమ్మినట్టు సమాచారం. ఇంకా అధికారులు పట్టించుకోకపోతే ఇంకా ఎక్కువ అమ్ముకొని లబ్ధి పొందే విధంగా దళారులు ప్రయత్నం చేస్తున్నారు. ప్రతిరోజు జగనన్న కాలనీలో కొత్త వ్యక్తులు కనబడితే స్థలం కావాలా అమ్ముతామంటూ దళారులు వాళ్ళ చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఈ విషయమై దర్యాప్తు జరిపించి ప్రభుత్వం ఇచ్చిన పేదోడి ఇంటికలను నిజం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. స్థానికంగా ఉండే కొంతమంది దళారులుగా తయారయ్యి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థలాల యజమానులు కాకుండా స్థలాలు అమ్మే దళారులే ఎక్కువగా కనిపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు ఇచ్చి ఆ సంక్షేమ ఫలాలు పేదలకు అందుతున్నాయా లేవా పేదలు ఆ ఫలాలను సద్వినియోగం చేసుకుంటున్నారా లేదా అనేది అధికారులు పట్టించుకోవడం లేదు. అది, కాంట్రాలు పట్టించుకోలేకపోవడంతో దళారుల రాజ్యమేలుతున్నారు. కోట్ల రూపాయలు చేతులు మారుతున్న ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు జగనన్న కాలనీలో నిజమవుతున్నాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఈ విషయమై జిల్లా కలెక్టర్ ద్వారా దర్యాప్తు జరిపించి దళారులను అదుపు చేయాలని నిజమైన పేదలు ఇళ్ల స్థలాలు ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సుమారు 1000 ప్లాట్లు చేతులు మారాయని వీటిని మరల పేదలకు అందించాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదవాడికి సొంతిల్లు ఉండాలని ఉద్దేశంతో కోట్ల రూపాయల ఖర్చుతో పట్టాలిచ్చి 1,80,000 రూపాయలతో ప్రభుత్వం ఇచ్చి ఇల్లు నిర్మించుకోమన్నారు. కొంతమంది దళారులు తయారయ్యి పేదవాడికి ఇచ్చిన స్థలాన్ని డబ్బు ఆశ చూపి అమ్మకం మొదలుపెట్టారు .ఈ దళారులను అరికట్టే నాధుడు లేడా ? ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు జగనన్న కాలనీ వైపు చూసి దళారుల్లో చేతుల్లో నుండి పేదవాడు ఇంటి స్థలాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## యర్రంశెట్టివారి పాలెంలో ఉపాధి హామీ పనులు



నరసాపురం, జూన్ 7 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉపాధి హామీ పథకం పనులలో భాగంగా నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెంలో బుధవారం సుమారు 2 వందలమంది కూలీలతో చెరువు తవ్వే పనిని గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ ప్రారంభించారు. ఈ చెరువు తవ్వే పనిని ప్రభుత్వం18 వందల మంది కూలీలకు కేటాయించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ గతంలో తమకు ఉపాధి హామీ పనులలో భాగంగా కుటుంబానికి వందరోజుల పని కల్పించడం జరిగిందని దానివల్ల తమకు ఏమాత్రం ప్రయోజనం లేదని మనిషికి కనీసం వంద రోజుల పని కల్పించాలని పని సమయాలలో తమకు త్రాగటానికి మంచినీరు, మజ్జిగ, పనిముట్లు పార, తట్ట, గునపము ప్రభుత్వం సరఫరా చేయాలని, మెడికల్ కిట్లను ఏర్పాటు చేయాలని, రోజు వేతనంగా కనీసం 6 వందల రూపాయలు ఇవ్వాలని, వేసవికాలం అలవెన్సు అందజేయాలని, తమ వేతనాలను పోస్ట్ మెన్ ద్వారా అందించే ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వానికి తెలియజేయాలని గ్రామ సర్పంచ్ నాగముత్యమాంబను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి త్రినాధ వెంకట నరసింహారావు (బాబులు), తెలగంశెట్టి శ్రీదేవి వాసు, పిట్ట రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాష్, సెక్రటరీ కె రఘురాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మునిసిపల్ అటెండర్ సస్పెన్షన్



నరసాపురం, జూన్ 7 (ప్రజాపాలన ప్రతినిధి) :నరసాపురం మునిసిపల్ కార్యాలయంలో అటెండరుగా పనిచేస్తున్న సిహెచ్.వెంకటేశ్వరరావు తరచూ విధులకు గైర్హాజరు కావడం, మద్యం సేవించి విధులకు హాజరవుతున్న కారణంగా అతనిని సస్పెండ్ చేశామని మునిసిపల్ కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటెండరుగా పనిచేస్తున్న సిహెచ్ వెంకటేశ్వరరావు విధులలో మద్యం సేవించడం, తరచూ గైర్హాజరు కావడంతో పలుమార్లు హెచ్చరించి షోకాజ్ నోటీసు జారీ చేసినప్పటికీ అతనిలో ఏవిధమైన మార్పు లేకపోగా బుధవారం అతను మద్యం సేవించి విధులకు హాజరు కావడంతో పోలీసులను పిలిపించి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా దానిలో 336. 80 పాయింట్లు నిర్ధారణ కాగా దీనిని తీవ్రంగా పరిగణించి సి.సి.ఎ.రూల్స్ 1991ను అనుసరించి క్రమశిక్షణా చర్యలలో భాగంగా అటెండర్ సిహెచ్ వెంకటేశ్వరరావు ను సస్పెండ్ చేయడం జరిగిందని కమిషనర్ తెలిపారు.

## రైతు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పం: ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను



పెనుగంచిప్రోలు జూన్ 7 ప్రజాపాలన ప్రతినిధి మండ ల పరిధిలోని కొల్లికుళ్ళ గ్రామం నందు 10.95 లక్షల రూపాయల వ్యయంతో సొసైటీ భవనం ఆధునీకరణ,కాంపౌండ్ వాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుపాల్గొన్నారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారు అని రైతులకు మేలు జరిగే విధంగా ముందుకు వెళ్తున్నారని తెలియ జేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేసిన విధంగా నేడు మన జగనన్న ప్రభుత్వంలో రైతుల కోసం ప్రతి గ్రా మంలో రైతు భరోసా కేంద్రలను ఏర్పాటు చేశారు అని అన్నారు.రైతులకు అవసరమైన విత్తనాలను అక్కడే కొనుగోలు చేసుకోవచ్చునని తెలిపారుఈ కార్యక్రమం లో కెసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు,గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంతోమంది నాయకుల త్యాగాల ఫలితమే బిజెపి




పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూన్ 7 (ప్రజా పాలన ప్రతినిధి ): భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ఆదేశాలతో పల్నాడు జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు సూచనలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరముల సుపరిపాలన గురించి ప్రజలకు తెలియజేయుటకు దేశవ్యాప్తంగా 30 రోజులు చేసే ఈ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పల్నాడు జిల్లాలో నరసరావుపేటలో బిజెపి జిల్లా పార్టీ ఆఫీసు నందు సీనియర్ కార్యకర్తల సమావేశం నరసరావుపేట అసెంబ్లీ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా బిజెపి పల్నాడు జిల్లా ఇన్చార్జ్ గాజుల వెంకయ్య నాయుడు మరియు పార్లమెంట్ కన్వీనర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పునుగుళ్ళ రవిశంకర్ , ప్రోగ్రాం కన్వీనర్లుగా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతరావు , జిల్లా కార్యదర్శి వడ్లమూడి వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ నాయకులు మాట్లాడుతూ తమ జీవితాలను పార్టీ అభివృద్ధి కోసం త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రలను తెలిపి తాము కూడా పార్టీకి చేసిన సేవలను సభాముఖంగా వివరించి ఆంధ్రప్రదేశ్ లో బిజెపి పార్టీ అభివృద్ధికి సీనియర్లు మరియు నేటితరం కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకులు బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఇత్తడి కిరణ్, కాకుమాను వెంకట కోటేశ్వరరావు, అడపా గురునాధరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మెడికొండ సత్యానందబాబు, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అమ్మా జిలాని, ఆర్టిజెన్ సెల్ జిల్లా కన్వీనర్ సిద్ధు అనంత నాగ బ్రహ్మాచారి, శంకుల చంద్రశేఖర్, కిసాన్ మోర్చా కన్వీనర్ మైలవరపు సుబ్బారావు, రొంపిచర్ల మండల అధ్యక్షుడు కాటా అంజనారెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు తాటికొండ బాబు,పట్టణ ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్,యువమోర్చా అధ్యక్షుడు దారా సుబ్బరాయ గుప్తా, మైనార్టీ మోర్చా షేక్ హసన్ , గడ్డం రామారావు తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకు -మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు



వీరులపాడు జూన్ 7 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో "గడపగడప కుమ న ప్రభుత్వంకార్యక్రమంలో భాగంగా బుధవారం ఉద యం ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షే మ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు అ డిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి అని గత పాల కుల మాదిరిగా మాటల్లో చెప్పకుండా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చేతల్లో చూపుతున్నా రన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అంద జేస్తూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యపాలనను సాకారం చేస్తూన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ అ న్నారు, వైయస్ జగన్ పై తప్పుడు ప్రచారాలతో బుర దచల్లేందుకు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు కుట్ర లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమం త్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి అండగా ఉండి రా నున్న ఎన్నికల్లో మద్దతు పలికి ఆశీర్వదించాలని కో రారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మీ ముత్తా రెడ్డి, జడ్పిటిసి అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరే షన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, మండల కన్వీనర్ ఆవు ల రమేష్ బాబు, గ్రామ పార్టీ కన్వీనర్ రాఘవయ్య, సర్పంచ్ పత్తిపాటి మల్లికార్జునరావు,వైస్ ఎంపీపీఆదాం బండి మురళి, చనుమోలు వాసు తదితరులు పాల్గొ న్నారు

## కాలువ పూడిక తీయత పనులు ప్రారంభించిన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట జూన్ 7 ప్రజాపాలన ప్రతినిధి:మండలప రిధిలో బలుసుపాడు గ్రామంలోని కాచవరం చానల్ సప్లై కాలువకు పూడికతీత పనులను బుధవారం ప్ర భుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15.35 లక్షల రూపాయలతో కాచవరం కాలువ పూడికతీత పను లు చేపట్టామన్నారు.రైతులకు సాగునీటి విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు.గత ప్రభుత్వం సాగునీటి సర ఫరా లో రైతులను అనేక విధాలుగా ఇబ్బందులు గురిచేసిందని నేడు మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రె డ్డి రైతు సంక్షేమ కోసం ఎంతగానో కృషిచేస్తున్నార న్నారు.నియోజకవర్గంలో పంట కాలువల ఆధు నీక రణ పనులకు శ్రీకారం చుట్టామని అన్నారు.ఈ కార్య క్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరా వు,మండల పార్టీ అధ్యక్షులు వీరభద్రం, దర్శనాల క మలేష్,బెడదాం సత్యనారాయణ,బజార్ సాయి డి ఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఆపన్న హస్తం అందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం




ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి : శ్రీ కాళహస్తి నియోజకవర్గం లో ఆదరణ కోల్పోయిన ఓ కుటుంబానికి నిత్యవసర సరుకులను అందించి ఆ కుటుంబానికి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం భరోసా కల్పించారు. ఏర్పేడు మండలందుర్గిపేరి గ్రామంలో నివాసముంటున్న దొడ్డి కృష్ణ రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబానికి సిపాయి ఫౌండేషన్ ద్వారా చేయూతనందించారు. ఆ కుటుంబానికి ఏడాదికి సరిపడా వంట సామాగ్రితో పాటు నూనె పప్పు దినుసులు లాంటి 40 రకాల నిత్యవసర సరుకులను ఉచితంగా గురువారం అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ పేదలకు తన వంతు సహాయంగా సిపాయి ఫౌండేషన్ ద్వారా నిత్యవసర సరుకులను అందిస్తున్నానని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రాజకీయ దృక్పథంతో కాకుండా కేవలం సేవాభావంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టానని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముని రామిరెడ్డి, మాజీ సర్పంచ్ మునిరెడ్డి, వెంకటస్వామి, సునీల్, బత్తెమ్మ, పద్మమ్మ, మాయావతి, జ్ఞానమ్మ, రామలక్ష్మి, రాజేశ్వరి, శ్రీనివాసులు, భాను, మునీశ్వర్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు

## కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే



మంగళగిరి,ప్రజా పాలన ప్రతినిధి : కార్పొరేషన్ పరి ధిలో బాపూజీ నగర్ మరియు శిబిరంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలిం చారు. బాపూజీ నగర్ కమ్యూనిటీ హాల్ మరియు నగర్ ప్రధాన ఆర్చి వద్ద బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటు మరియు శిబిరం కమ్యూనిటీ హాల్ వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సూచన చేశారు.మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బాపూజీ నగర్ మరియు శిబిరం ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు.తుది దశకు చేరుకున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆర్కేసూచించారు.కార్పొరేట్ తరహా కళ్యాణ మండపాల వలే రూపుదిద్దుకుంటున్న ఈ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: శ్రీ కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి రూరల్ మండలంలోని పాకాల పాడు తెలుగు యువత ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా తెలుగు యువత ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు శ్రీ కన్నా గారి వెంట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు మన్యం శివ నాగమల్లేశ్వర ( అబ్బూరు మల్లి )పాల్గొన్నారుఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ గారు యలైనైడి రామస్వామి , ముక్కపాటి రామచంద్రయ్య , కోయ లక్ష్మయ , కట్టా రమేష్ ,ఎల్ రవి , పాకాల పాడు సీనియర్ నాయకులు సత్యనారాయణ ,శ్రీనివాస రావు అప్పారావు , గన్నమనేని శ్రీనివాసరావు గారు , షేక్ అనీఫ్,పెద్దమొక్కెన సర్పంచ్ సాంబశివరావు ,కట్టమూరు మాజీ సర్పంచ్ అప్పారావు ,కాలి ప్రసాద్ గ సుధీర్ ,షేక్ బాబు ,పాకాల పాడు గ్రామస్తులు మరియు కట్టమూరు ,పెద్దమక్కేనా అబ్బూరు గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు , నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ జూన్ 7 ప్రజా పాలన ప్రతినిధి: మండలప రిధిలోని కొత్త కంచల గ్రామంలో దేవాదాయ శాఖ ని ధులు రూ.38 లక్షల అంచనా వ్యయంతో నూతనం గా నిర్మించనున్న శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయ ని ర్మాణానికి శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు బుధవారం భూమి పూజ నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ రాష్ట్రం లో దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూ రు చేస్తుందని తెలిపారు. నూతనంగా దేవాలయాల నిర్మించడంతో పాటు పురాతన దేవాలయాల మర మ్మత్తు పనులకు కూడా పెద్ద ఎత్తున నిధులు కేటా యిస్తున్నట్లు చెప్పారు నియోజకవర్గంలోని దేవాల యాల మరమ్మత్తుల పనులకు మరియు నూతన దేవాలయాల నిర్మాణాలకు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిం దని, నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారుఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ కన్వీనర్ చల మల మధు, అంబారుపేట మాజీ సర్పంచ్ గరికపాటి భాస్కరం (నానయ్య), సొసైటీ అధ్యక్షులు తాడపనేని సత్యనారాయణ, ఎంపీటీసీ రామిరెడ్డి సీతయ్య, చ లమల నారాయణ, చలమల రామ్మూర్తి, రామిరెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అయినవిల్లి ఉద్యాన అధికారి యం.బబిత నల్లజర్ల మండలం ఉద్యాన అధికారిగా బదిలీ



అయినవిల్లి జూన్ 07 ప్రజాపాలన ప్రతినిధి :అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండల ఉద్యాన శాఖ అధికారిగా పని చేస్తూ..తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలానికి ఉద్యాన శాఖ అధికారి బదిలీ అయినట్లుగా ఉద్యాన అధికారి యం.బబిత బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అందరి సహకారంతో మండలం లో ఇబ్బంది లేకుండా పని చేశానని ఆమె అన్నారు.నాకు సహకరించిన మండల రైతులకు, ప్రజాప్రతి నిధులకు,అధికారులకు మరియు పాత్రికేయులకు అందరికీ ధన్యవాదములు తెలిపారు.

# ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే లక్ష్యం

## రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 26 వ డివిజన్ 28 వ వార్డు సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి అంగిరేకుల నాగేశ్వరరావు గొల్లభామ, కోఆర్డినేటర్ కోలా నాగాంజనేయులుతో కలిసి బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాకానీ నగర్లో విస్తృతంగా పర్యటించి 412 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణుకి ప్రాంత ప్రజలు ఘన స్వాగతం పలికారు, కర్పూర హారతులు పట్టారు. శాలువలతో ఘనంగా సత్కరించారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేర్చినట్లు మల్లాది విష్ణు తెలిపారు. మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు.. పేదల కోసం ఏ ఒక్క మంచి కార్యక్రమం చేపట్టలేకపోయారని ఆరోపించారు. కానీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నవరత్నాల పథకాల ద్వారా పేదల జీవన స్థితిగతులలో సమూల మార్పులు తీసుకొచ్చారని చెప్పుకొచ్చారు. అనంతరం ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులకు సూచనలు చేశారు.కంటి చూపు మందగించిన శాఖమూరి సాయిబాబు అనే వ్యక్తికి వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కళ్ల పరీక్షలు నిర్వహించడమే కాకుండా కళ్లద్దాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు ద్వారా జగనన్న ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నార్త్ ఎమ్మార్వో దుర్గాప్రసాద్, ఆర్.ఐ.ప్రసాద్, సీడీఓ జగదీశ్వరి, నాయకులు బాడిద అప్పారావు, డి.శంకర్, పారా ప్రసాద్, బి.రాజు, ఎం.శ్రీనివాస్, సిద్ధాబత్తుల రమణ, పసుపులేటి కోటేశ్వరరావు, బాడిత సత్యవతి, బెజ్జం రవి, భోగాది మురళి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయలేదు: ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, జూన్ 7 (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఏనాడు వమ్ము చేయలేదని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇక్కడ పోటీ చేసినప్పటికీ తాను స్థానికుడినని నిత్యం అందుబాటులో ఉంటానని నియోజకవర్గ ప్రజలు భావించి తనను గెలిపించారని వారి నమ్మకాన్ని పూర్తిస్థాయిలో నిలబెట్టుకున్నానని ఆయన పేర్కొన్నారు. బుధవారం రెండవ పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా 33 వ వార్డులో 41 లక్ష 50 వేల రూపాయలతో శ్రీరాంపురం పంట కాలువ వద్ద నుండి డిఎన్ఆర్ కాలేజీ రోడ్డు హన్సి కళ్యాణమండపం వరకు నిర్మించిన బీటీ రోడ్, సిసి డ్రైన్ ఆర్సీసీ స్లాబ్ కల్వర్టును ప్రారంభించారు. అనంతరం 31 వ వార్డు బలుసుమూడి లో రూ. కోటి లక్ష 50 వేల రూపాయలతో నిర్మించే కొత్త రామాలయం నుండి ఆదిత్య జూనియర్ కాలేజీ వరకు సిసి రోడ్, సిసి డ్రైన్ ఆర్సీసీ స్లాబ్ కల్వర్ట్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేనివిధంగా భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేదిశగా చర్యలు తీసుకున్నామని అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నానని కరోనాలో సైతం ప్రజల మధ్యనే ఉన్నానని గుర్తుచేశారు. ప్రజలు కోరుకున్న విధంగా అభివృద్ధి పనులు చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశించినట్లుగానే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అయితే నియోజవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రతిపక్షాలు ఈర్ష్య, ద్వేషం పెంచుకుని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని దయచేసి ప్రజల కోరిక మేరకు జరుగుతున్న నియోజవర్గ అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ తప్పులు జరిగితే వాటిని తన దృష్టికి తీసుకురావాలని ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే హితవు పలికారు. భీమవరం నియోజకవర్గంలో నవరత్నాల రూపంలో నాలుగేళ్ల కాలంలో ప్రజలకు రూ. 12 వందలకోట్ల మేర లబ్ది జరిగిందని అన్నారు. అభివృద్ధికి ఆటంకాలు కలిగించి అవాంఛనీయ సంఘటనలు జరిగేలా, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే విధంగా ఎవరైనా చేయాలనుకుంటే అది చాలా తప్పిదమని ప్రజలు హర్షించరని, దయచేసి జరుగుతున్న అభివృద్ధిపై ప్రజలు సంతోషంగా ఉన్నారనే విషయాన్ని ప్రతిపక్షాలు తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, తోట బోగయ్య, కోడె యుగంధర్, పలువు పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



నందిగామ జూన్ 7 ప్రజాపాలన ప్రతినిధి:మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులను పర్మి నెంట్ చేసి , మున్సిపల్ ఉ ద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్ర ధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 31 నుండి జూన్ 9వ తేదీ వ రకు జరిగే రాష్ట్ర ప్రచార జాత బుధవారం మున్సిప ల్ కార్యాలయం వద్దకు చేరుకున్నది. ఈ సందర్భంగా పట్టణంలో మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూ ని యన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పారి శుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమ లు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశు ద్ధ కార్మికులు ఎంప్లాయిస్ సమస్యలు వారం రోజుల్లో పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభు త్వం నాలుగు సంవత్సరాలు దాటినా కూడా పారిశు ద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు పెంచకపోవడం దు ర్మార్గమైన చర్యని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఆప్కాస్ సిబ్బంది పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చే యాలని పాత పెన్షన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లా యిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నూకరాజు రాష్ట్ర నాయకులు జీ లక్ష్మి, నాయుడుఎన్టీఆర్ జిల్లా సిఐటి యు ప్రధాన కార్యదర్శి ఎన్సిహెచ్ శ్రీనివాస్, జిల్లా కా ర్యదర్శి ఎ. కమల , నందిగామ సిఐటియు కార్యదర్శి కే గోపాల్, నందిగామ మున్సిపల్ వర్కర్స్ యూనియ న్ అధ్యక్ష కార్యదర్శులు సాల్కేట్ నరేష్, సైదా, మాణి క్యం, పిచ్చయ్య, గరికపాటి ప్రసాద్, రుతుమ, బేబీ, రా జరత్నం ,నతానీలు కార్మికులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, జూన్ 7 (ప్రజాపాలన ప్రతినిధి) : క్రీడలను కాలక్షేపానికి కాకుండా దేశ ప్రగతికి పాటు పడేలా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఆటల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక కేజిఅర్ఎల్ కళాశాల క్రీడా మైదానంలో భీమవరం ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంటును బుధవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. 10 రోజులపాటు ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని విజేతలకు రూ. లక్ష, రన్నర్స్ కు రూ. 50 వేలు ప్రైజ్ మనీగా అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, పార్టీ నాయకులు తోట బోగయ్య, కోడె యుగంధర్, క్రికెట్ టోర్నమెంట్ కమిటీ సభ్యులు చుక్క కిషోర్, చందు, నర్సి, బైరెడ్డి రామకృష్ణ, జాన్, ప్రిన్స్ సురేష్, శివరాం, ఆకుల ప్రసాద్, రాజేష్, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


# మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి



మచిలీపట్నం కలెక్టరేట్ జూన్ 7: ప్రజాపాలన: మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పరిశీలించిన రాష్ట్ర వైద్య మౌలిక వసతులు అభివృద్ధి సంస్థ విసి ఎండి డి. మురళీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఎమ్మెల్యే పేర్నిరాష్ట్ర వైద్య మౌలికవసతుల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి. మురళీధర్ రెడ్డి జిల్లా కలెక్టర్ పిరాజాబాబు, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య నాని లతో కలిసి బుధవారం స్థానిక మెడికల్ కళాశాల సందర్శించి భవన నిర్మాణాలప్రగతి, నిర్మాణాలు పూర్తయిన భవనాలలో సౌకర్యాల కల్పన వంటి అంశాలు పరిశీలించారు. మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎండి జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. మెడికల్ కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్లు ప్రారంభించుటకు హాస్టల్ భవనాలు, ల్యాబ్స్ భవనాలు షెడ్యూల్ ప్రకారంపనులు పూర్తి చేయాలని ఆదేశించారు.నీటి సరఫరా కోసం 8.8 కోట్లు మంజూరు చేసినట్లు, ఈ పనులు వెంటనే చేపట్టెల టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి అన్నారు.150 మంది విద్యార్థులకు హాస్టల్ వసతికి నిర్మిస్తున్న భవనాలలో వసతి సౌకర్యాలతో పాటు తాగునీటి సౌకర్యంకల్పించుటకు సంపు పాయింట్ నుండి పైప్ లైన్ కనెక్షన్లు వంటి పనులు పూర్తి చేయాలన్నారు. హౌస్ కీపింగ్ సంబంధించి ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా పనులు, ఇంటర్నెట్ సౌకర్యం, సీసీ కెమెరాలు ఏర్పాటు, ఆడియో వీడియో సిస్టం ఏర్పాటు పనులు, అంబులెన్స్ లు, ల్యాబ్స్ లో పరికరాలు ఏర్పాటు, ఏసీ సౌకర్యం పనులు ఎంతవరకు వచ్చాయి ఆరా తీశారు.మైక్రోబయాలజీ వంటి నాలుగు విభాగాలకు నాలుగు లేబరేటరీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు శానిటేషన్, సెక్యూరిటీ ఏర్పాటుచేయాలని పెస్ట్ కంట్రోల్ చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్ సంబంధించి పక్కాగా పై కప్పుతో ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలం లోగా డ్రైనేజీ నిర్మాణ పనులు, అప్రోచ్‌రోడ్లు అప్రోచ్ రోడ్లు పూర్తి చేయాలని అన్నారు హాస్టల్లో వద్ద ల్యాబ్స్ వద్ద తాగునీటి సరఫరాకు అవసరమైనన్ని వాటర్ డిస్పెన్సర్లు, ప్యూరిఫైయర్లు ఏర్పాటు చేయాలని ఎండి సూచించారు. హాస్టల్లో ఫర్నిచర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విండోలకు మస్కిటో నెట్లు, హ్యాంగర్స్ ఏర్పాటు చేయాలనీ, వైద్య పరికరాలు కళాశాలకు పంపామని, అవి తీసుకుని స్టాక్ ఎంట్రీలు పక్కాగా నమోదు చేయడంతో పాటు స్టోర్ ఇన్చార్ట్ లను ఏర్పాటుచేయాలన్నారు. జూలై నుండి ఇన్స్టాలేషన్ పనులు మొదలు పెట్టాలన్నారు. వచ్చేవారం ముఖ్యమంత్రి సమీక్షిస్తారని విలువగా పనులన్నీ కొలిక్కి రావాలన్నారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఇక్కడకు వచ్చి కార్యకలాపాలు ప్రారంభించాలని సూచించారు గర్ల్స్‌హాస్టల్ కాంపౌండ్ వాల్ పూర్తి చేయాలని అన్నారు అడ్మిషన్ల ముందు పిల్లలు వారి తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి వసతులుచూసుకుంటారని, వారిలో సానుకూల దృక్పథం కలిగేలా పనులన్నీ సకాలంలో పూర్తిచేసి ఇతర కళాశాలలకు మోడల్ గాతీర్చిదిద్దాలని ఎండి సూచించారు. కేవలం ప్రధాన భవనాలు నిర్మాణం పూర్తి చేస్తే అంతా అయిపోయినట్లు కాదని, వసతుల కల్పనముఖ్యమని గుర్తుంచుకోవాలన్నారు.స్థానిక సర్వజన ఆసుపత్రి లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పత్రిలోరెండు లిఫ్టులు మరమ్మత్తులు అవసరమని, కాన్ఫరెన్స్ హాల్ అవసరమైన మరమ్మత్తులు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేయాల్సిఉందని ఆసుపత్రి సూపర్డెంట్ తెలుపగా, అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపాలనీ సూపర్నెంట్ ను ఆదేశించారు. రెండుబస్సులు ఏర్పాటు చేయాలని తెలుపగా వాటి కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ వైద్య సేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ సూపర్నెంట్ ఇంజనీర్ బలరాం రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి రవీంద్రబాబు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ఆశాలత, మేఘం ప్రతినిధులు కృష్ణారెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

# సినిమా స్పాట్

## చైతు "కస్టడీ" ఓటిటి రిలీజ్ డేట్ ఫిక్స్.!




అక్కినేని వారి యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అఖిల్ అక్కినేని హీరోగా యంగ్ హీరోయిన్ కృతి శెట్టి హీరోయిన్ గా కోలీవుడ్ దర్శకుడు వెంకట్ ప్రభు తెరకెక్కించిన ఇంట్రెస్టింగ్ బై లాంగువల్ థ్రిల్లర్ చిత్రం "కస్టడీ" కోసం తెలిసిందే. ఇక ఈ చిత్రం అయితే అనుకున్న రేంజ్ విజయాన్ని అందుకోలేదు. ఇక దీనితో నెక్స్ట్ ఈ సినిమా ఓటిటి రిలీజ్ కోసం వెయిట్ చేసారు. మరి ఫైనల్ గా అయితే ఈ సినిమా ఓటిటి రిలీజ్ పై క్లారిటీ వచ్చేసింది. మరి ఈ సినిమా స్ట్రీమింగ్ రైట్స్ సొంతం చేసుకున్న అమెజాన్ ప్రైమ్ వీడియో వారు అయితే అనౌన్సమెంట్ ఇచ్చేసారు. మరి ఈ చిత్రం అయితే ఒరిజినల్ తెలుగు, తమిళ్ సహా మళయాళ మరియు కన్నడ భాషల్లో అయితే ఈ జూన్ 9 నుంచి ఓటిటి లో స్ట్రీమింగ్ కి రానున్నట్టుగా ఇప్పుడు అనౌన్స్ చేసారు. సో అప్పుడు మిస్ అయ్యినవారు ఐతే ఈ జూన్ 9 నుంచి చూసి ఎంజాయ్ చేయవచ్చు.

## నిర్మాతల పని చాలా కష్టం.. అందుకే యాక్టర్ అయ్యాను: రానా



హీరో రానా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ ఉన్నప్పటికీ... తనకంటూ ఓ ప్రత్యేక ఇమేజ్ అయితే క్రియేట్ చేసుకున్నారు. టాలీవుడ్ బడా నిర్మాతల్లో ఒకరైన సురేశ్ బాబు కుమారుడు అయిన రానా... ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. అందరిలా మాస్ కమర్షియల్ మూవీస్ కాకుండా... విభిన్నమైన స్టోరీస్ చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే రానాకు జక్కన్న తీసిన బహుబలితో దేశ వ్యాప్త క్రేజ్ అయితే వచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. తన జీవితంలో ఎదుర్కొన్న అతి పెద్ద సవాలు గురించి చెప్పుకొచ్చాడు. తాను నటుడిని కాక ముందు పెద్ద సవాలును ఎదుర్కొన్నట్లు చెప్పిన రానా... నిర్మాతగా మారాలా.. లేదంటే నటుడిని అవ్వాలా.. అని చాలా ఆలోచించారట. 2005 లో మొదటిసారి నిర్మాతగా మారి బొమ్మలాట అనే సినిమాను తీసినట్లు వివరించారు. దానికి రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. కానీ ఆ సినిమా ప్రేక్షకాదరణ పొందలేదని తెలిపారు. చిన్న సినిమాలు విడుదలవ్వాలంటే ఎంత కష్టపడాలో అప్పుడే అర్థం చేసుకున్నానని చెప్పుకొచ్చాడు. తనకు నచ్చిన కొన్ని కథలను తెరకెక్కించాలని ఎంతోమంది దర్శకులను టెక్నిషియన్స్ను కలిశానని వివరించాడు. కొత్త కథలను తీసుకురావాలంటే సినీ పరిశ్రమలో ఎంతో కష్టమని అర్థం చేసుకున్నాను. అందుకే యాక్టర్ని అయ్యానని చెప్పాడు. ఇక 'ప్రేక్షకులు ఎప్పటికప్పుడు కొత్త దనాన్ని కోరుకుంటున్నారన్న రానా... దానికి తగినట్లు సినిమాల్లో మార్పులు రావాలని సూచించాడు. హృతిక్ రోషన్ షారుక్ ఖాన్ వంటి నటులు స్టార్ హీరోలుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అందుకే ప్రేక్షకులు కొత్తగా వచ్చేవారిలో మరో హృతిక్ రోషన్ ను లేదంటే మరో షారుక్ ఖాన్ ను చూడాలని అనుకోవడం లేదని చెప్పుకొచ్చాడు. ఎప్పుడు మీలో ఓ ప్రత్యేకత ఉండాలని వారు అనుకుంటారని సూచించారు. ఇక సినీ ఇండస్ట్రీలో బాహుబలి ఓ అద్భుతమని చెప్పాలన్న రానా... దాని తర్వాత సినిమాని చూసే విధానం మారిందని వివరించాడు. రానా వ్యాఖ్యలకు నెటిజన్లు అయితే సపోర్ట్ చేస్తున్నారు.


## సంయుక్తా మీనన్ అందుకు సిద్దమేనా?

మాలీవుడ్ భామల్ని బోల్డ్ పెర్ఫార్మెన్స్ కి కన్విన్స్ చేయడం అంత వీజీకాదు. స్కిన్ షో చేయాలన్నా? క్లీవేజ్ అందాలు ఆవిష్కరించాలన్నా! ఇంటిమేట్ సన్నివేశాల్లో నటించాలన్నా! ససేమీరా అంటారు. ఈ విషయంలో కొత్తగా వచ్చే భామలు అస్సలు అంగీకరించరు. డీసెంట్ పాత్రలపై చూపించే శ్రద్ధ బోల్డ్ పాత్రలపై చూపించరు. కేవలం నటనతో మెప్పిస్తామనే కమిట్ మెంట్ తోనే ఉంటారు. అయితే కొన్నాళ్లకి అన్ని పక్కకు పోతాయనుకోండి. అవకాశాలు తగ్గేసరికి ఎలాంటి పాత్రలకైనా సై అంటారు. కీర్తి సురేష్.. అనుపమ పరమేశ్వరన్ లాంటి భామలు అలా ఒకే అన్న తర్వాత బిజీ నాయికలుగా మారారు. నో చెప్పిన వారంతా మళ్లీ తిరిగి మాలీవుడ్ కి వెళ్లిపోయారు. అక్కడ తమకు నచ్చిన పాత్రలు చేసుకుంటూ కెరీన్ ని ముందుకు నడిపిస్తున్నారు. మరి హాట్



సంచలనం సంయుక్తా మీనన్ వీళ్లలో ఏ క్యాటగిరీకి చెందింది? అన్నది ఇంకా క్లారిటీ లేదు. అమ్మడికి ఇప్పటివరకూ అలాంటి సన్నివేశం ఎదురవ్వలేదు. 'భీమ్లా నాయక్' తో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అందులో డీసెంట్ పాత్రలోనే నటించింది. ఆ తర్వాత 'బింబిసార'..'సార్' లాంటి చిత్రాల్లోనూ అంతే డీసెంట్ గా కనిపించింది. వాటిలో సన్నివేశాలు డిమాండ్ చేయలేదు కాబట్టి సంయుక్త రొమాంటిక్ గా కనిపించాల్సిన అవసరం రాలేదు. ఇటీవలే రిలీజ్ అయిన 'విరూపాక్ష'లోనూ అదే తరహా పాత్ర పోషించింది. అవన్నీ మంచి విజయాలు సాధించాయి. దీంతో బోల్డ్ గా నటించాలి! అన్న ప్రపోజల్ అమ్మడి ముందుకు వెళ్లినట్లు లేదు. సక్సెస్ ల్లో ఉన్నంత కాలం అలాంటి అవకాశాలిస్తామన్నా నో చెప్పిన భామల్నే ఇప్పటివరకూ చూసాం. మరి సంయుక్త ముందుకు అలాంటి ప్రపోజల్ వెళ్తే ఎలా స్పందిస్తుంది! అన్నది ఆసక్తికరం. సంయుక్త వ్యక్తిగతంగా మంచి మాటకారి. ఆ రకంగానూ టాలీవుడ్ లో పాపులర్ అయింది. ఫ్యాన్ ఫాలోయింగ్ ని బిల్డ్ చేసుకుంటుంది. ఈ తరహా స్ట్రాటజీ కొంత వరకూ బోల్డ్ ప్రపోజల్స్ దరి చేరనివ్వకుండా ఆపుతాయి. ఇప్పటికే ఆస్ట్రాటజీ అప్లై చేసింది కాబట్టి అప్పుడే అలాంటి ప్రపోజల్స్ అమ్మడి ముందుకెళ్లే అవకాశం లేదు.

## "బ్రో" లో ఫీస్ట్ గా ఈ సాంగ్.!





మెగా సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ హీరోగా తన కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ ని అయితే లేటెస్ట్ గా "విరూపాక్ష" తో అందుకున్నాడు. మరి భారీ వసూళ్లతో తన కెరీర్ లో మొదటి 100 కోట్ల గ్రాసర్ గా నిలిచిన ఈ చిత్రం తర్వాత మరో సాలిడ్ ప్రాజెక్ట్ "బ్రో" తో అయితే ఇపుడు రాబోతున్నాడు. మరి ఇందులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రెజెన్స్ కూడా ఉండడంతో ఈ ప్రాజెక్ట్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్ళింది. అలాగే వెర్సటైల్ నటుడు సముద్రఖని ఈ చిత్రాన్ని దర్శకత్వం వహిస్తుండగా ఇప్పటికే వచ్చిన పోస్టర్ లు మోషన్ పోస్టర్ టీజర్ లకి సాలిడ్ ఫీడ్ బ్యాక్ రాగా లేటెస్ట్ గా అయితే థమన్ కంపోజ్ చేసిన ఓ సూపర్ బీట్ కోసం ఇప్పుడు ఇంట్రెస్టింగ్ అప్డేట్ తెలుస్తుంది. ఊర్వశి తోనే ప్లాన్ చేసిన ఈ సాంగ్ లో పవన్ మరియు సాయి ధరమ్ తేజ్ లు కూడా మెస్మరైజ్ చేయనున్నారట. మరి తేజ్ అయితే తన డాన్స్ మూమెంట్స్ తో ఈ సాంగ్ లో అదరగొట్టనుండగా పవన్ కూడా తన మార్క్ స్వాగ్ అండ్ డ్రెస్సింగ్ స్టైలింగ్ తో అయితే ఫ్యాన్స్ కి ఫీస్ట్ ఇస్తాడని తెలుస్తుంది. మొత్తానికి అయితే ఓ సూపర్ స్పెషల్ సాంగ్ సినిమాలో ఉంటుందని అర్ధం అవుతుంది.

## "ఎన్టీఆర్ 31" పై ఇంట్రెస్టింగ్ బజ్.!



ప్రస్తుతం యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా "దేవర" కోసం తెలిసిందే. మరి ఈ చిత్రం అయితే ఇప్పుడు శరవేగంగా కంప్లీట్ అవుతుండగా ఈ సినిమా తర్వాత తారక్ నుంచి సెన్సేషనల్ లైనప్ కూడా ఉంది. ఇక ఎన్టీఆర్ కెరీర్ లో 30వ సినిమాని ఇప్పుడు కొరటాలతో చేస్తుండగా నెక్స్ట్ 31వ సినిమా అయితే పాన్ ఇండియా దర్శకుడు ప్రశాంత్ నీల్ తో అనౌన్స్ కూడా చేశారు. ఇక ఇదిలా ఉండగా ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు అనే దానిపై ఇంట్రెస్టింగ్ బజ్ అయితే ఇప్పుడు సినీ వర్గాలు నుంచి వినిపిస్తుంది. అయితే ఈ చిత్రంలో ప్రముఖ బాలీవుడ్ టు హాలీవుడ్ టర్న్ హీరోయిన్ ప్రియాంకా చోప్రా జోనస్ నటించనుంది అని అంటూ కొన్ని రూమర్స్ ఇప్పుడు వినిపిస్తున్నాయి. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉందో కాలమే నిర్ణయించాలి.

## అయ్యో అనుపమ వేదాంతం మాట్లాడుతుందే!



తెలుగు తెర మీద మెరిసిన మలయాళీ బ్యూటీలలో అనుపమ పరమేశ్వరన్ కూడా ఒకరు. మలయాళంలో తెరకెక్కిన ప్రేమమ్ అనే సినిమా ద్వారా ఆమె హీరోయిన్ గా పరిచయమైంది. ఆ ఒక్క సినిమా అనుపమ పరమేశ్వరన్ కు సూపర్ క్రేజ్ తెచ్చి పెట్టింది. ఆ తర్వాత కోడి అనే సినిమాతో తమిళ సినీ పరిశ్రమకు ఎంట్రీ ఇచ్చి అక్కడ కూడా చాలా సినిమాల్లో నటించింది. ఇక తెలుగులోను ప్రేమమ్ సినిమాలో నటించి ఒక్కసారిగా అందరి దృష్టిని తన వైపు తిప్పేసుకుంది. కాటుక కళ్ళు.. లంగా వోణీలో కనిపిస్తూ అందరినీ మైమరిపించింది. ప్రస్తుతానికి ఆమె తమిళంలో జయం రవి హీరోగా నటిస్తున్న సైరన్ అనే సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాకి సంబంధించి ఒక ప్రెస్ మీట్ లో పాల్గొని పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటూ వచ్చింది. ఈ క్రమంలోనే తన మనసుకు కష్టమైన విషయాలు బాధించే విషయాలను సాధ్యమైనంత త్వరగా మరిచిపోవడానికి ప్రయత్నిస్తానని ఆమె చెబుతోంది. తాను చాలా పాజిటివ్ గా ఉండే వ్యక్తినని చెబుతూనే తనకు ఏదైనా నచ్చకపోతే మొహం మీదే నిర్మొహమాటంగా చెప్పేస్తానని ఆ తర్వాత దాని గురించి మరిచిపోతానని ఆమె చెప్పుకోస్తోంది. ఇక జీవితం అనేది చాలా చిన్నదని చెప్పుకొచ్చిన అనుపమ పరమేశ్వరన్ ఈ లోకంలో ఎంత కాలం ఉంటామో తెలియదు వెళ్లే సమయం ఎప్పుడు వస్తుందో కూడా తెలియదు అంటూ వేదాంతం మాట్లాడుకొచ్చింది. జీవితంలో ఎదురైన ఆటంకాలు సమస్యలు మనసులో ఉంచుకుని మనలో శక్తిని వృధా చేసుకోరాదని ఆమె అభిప్రాయపడింది. ఎలా అయితే సీసీ కెమెరాలలో ఉన్న విజువల్స్ అన్ని నెల తర్వాత డిలీట్ అయిపోతాయో మన మనసును కూడా అలాగే ఉంచుకోవాలంటూ ఆమె ఒక ఆసక్తికరమైన సలహా ఇచ్చింది. ఇక తెలుగులో ఆమె చివరిగా కార్తికేయ 2 అనే సినిమాతో హిట్టు అందుకుంది. ఆ తర్వాత బటర్ ఫ్లై అనే సినిమా చేసింది. కానీ ఆ సినిమా ఆమె కెరీర్ కి పెద్దగా కలిసి వచ్చేలా అయితే కనిపించలేదు. ఇక మరిన్ని సినిమా అవకాశాలు దక్కించుకునే ప్రయత్నాల్లో బిజీబిజీగా గడుపుతుంది అనుపమ.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com